PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 174 | విజయవాడ, ఆదివారం 26 జనవరి 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 26 January 2025 | Rs



6

సత్తా చాటిన తెలుగు తేజం

- 72పరుగులతో రాణించిన హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ



వైవిధ్యం ఆచరిస్తేనే సమానత్వం !

- ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధ

7

డాక్టర్ దువ్వూరు నాగేశ్వరరెడ్డికి పద్మ విభూషణ్



దువ్వూరు నాగేశ్వర రెడ్డి



సినీ నటులు బాలకృష్ణ



అజిత్



శోభన









మిరియాల అప్పారావు (మరణానంతరం), నాగఫణిశర్మ, మంద కృష్ణ మాదిగ, రాఘవేంద్రాచర్య పంచముఖి

సినీ నటులు బాలకృష్ణ, అజిత్, శోభనలకు పద్మ భూషణ్


మాడుగుల నాగఫణి శర్మ, మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ

మొత్తంగా ఏడుగురు తెలుగువారికి పద్మ పురస్కారాలు

న్యూఢిల్లీ : భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మ అవార్డులను కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఏడుగురికి పద్మ విభూషణ్, 19మందికి పద్మ భూషణ్, 113మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించారు. కళలు, సామాజిక సేవ, ప్రజా సంబంధాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, వాణిజ్యం, పరిశ్రమలు, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు వంటి పలు రంగాల్లో విశిష్ట కృషి చేసినవారికి ఈ అవార్డులందజేస్తారు. పద్మ అవార్డులు వచ్చిన వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఏడుగురు వున్నారు. వారిలో ప్రముఖ వైద్యులు దువ్వూరు నాగేశ్వర రెడ్డి (హైదరాబాద్‌లోని ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ చైర్మన్)కి పద్మ విభూషణ్, నందమూరి వంశానికి చెందిన ప్రముఖ నటుడు బాలకృష్ణకు పద్మభూషణ్ లభించాయి. తమిళ, తెలుగు సినీ రంగాలకు చిరపరిచితుడైన హీరో అజిత్ కుమార్‌కు, ప్రముఖ నటి, భరత నాట్య కళాకారిణి శోభన చంద్రకుమార్‌కు కూడా పద్మ భూషణ్ లభించింది. ప్రజా సంబంధాల విభాగంలో మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం లభించింది. ఎంటి. వాసుదేవన్ నాయర్, ఒసాము సుజుకి, శారదా సిన్హాలకు మరణానంతరం పద్మ విభూషణ్ అవార్డులు ప్రకటించారు. మొత్తంగా అవార్డులు ప్రకటించిన వారిలో 23మంది మహిళలు వున్నారు. విదేశీయులు, ఎన్ఆర్ఐ, పిఐఓ, ఓసిఐ కేటగిరీలకు చెందిన వారిలో 10మంది వుండగా, మరణానంతరం 13మందికి అవార్డులను ప్రకటించారు. సాధారణంగా మార్చి, ఏప్రిల్ మాసాల్లో రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో ఈ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేస్తారు. పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించిన వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కె.ఎల్ కృష్ణ (సాహిత్యం, విద్య), వడిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి, మాడుగుల నాగఫణి శర్మ (కళా రంగం) వున్నారు. కాగా, మిరియాల అప్పారావు (కళా రంగం)కు మరణానంతరం పద్మశ్రీ అవార్డును ప్రకటించారు.

దావోస్ అంటే పెట్టుబడులే కాదు

- గ్లోబల్ కార్పొరేట్ల భేటీకి అదొక వేదిక
- రాష్ట్రంలో అవకాశాలు వివరించాం
- త్వరలో కంపెనీలు క్యూ కడతాయి
- ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దావోస్ అంటే కేవలం పెట్టుబడుల లెక్కలు, ఒప్పందాలే కాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఉండవల్లిలోని తన నివాసం వద్ద ఉన్న మీడియా పాయింట్లో ఆయన మాట్లాడుతూ దావోస్ పర్యటనకు సంబంధించిన అంశాలు వివరించారు. ప్రపంచస్థాయి బిగ్ కార్పొరేట్లు, అడ్మినిస్ట్రేటర్లు ఒకచోట కలుసుకుని గ్లోబల్ పరిస్థితులపై చర్చించుకునేందుకు దావోస్ ఒక వేదిక అని చెప్పారు. ఇంత కీలకమైన ఈ వేదికను లెక్కలకు పరిమితం చేశారని వ్యాఖ్యానించారు. తాము రాష్ట్రంలో ఉన్న అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేసినట్లు తెలిపారు. ప్రపంచంలో ఉన్న ప్రధాన కంపెనీల అధిపతులందరినీ కలవడానికి దావోస్‌లో అవకాశం వచ్చిందని చెప్పారు. వీరందరినీ వ్యక్తిగతంగా కలవాలంటే అనేక సమస్యలు ఉంటాయని చెప్పారు. అక్కడకు వెళ్లడం వల్ల నాలెడ్జికి సంబంధించి అనేక అంశాలు, నెట్ వర్కింగ్ తెలుసుకోవచ్చని అన్నారు. ప్రపంచం ఎలా ముందుకు వెళుతుందనేది అర్థమవుతుందని, దాని ఆధారంగా రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక వేసుకోవచ్చని తెలిపారు. అక్కడ 27 సమావేశాల్లో పాల్గొన్నాట్లు చెప్పారు. రాష్ట్ర బృందంలో ఉన్న మంత్రి నారా లోకేష్ 35 సమావేశాలు, ఐదు రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరయ్యారని పేర్కొన్నారు. దీని ఫలితాలు త్వరలో కనపడతాయని అన్నారు. కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడతాయని అన్నారు. ప్రపంచం మొత్తం ఎఐ, గ్రీన్ ఎనర్జీ

మిగతా 7లో

వక్ఫ్ కమిటీ చైర్మన్ చర్యను తప్పుబట్టిన సిపిఎం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ

వక్ఫ్ బిల్లుపై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) చైర్మన్ తీసుకున్న చర్యను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా విభేదించింది. ప్రభుత్వ అభిప్రాయాలను వ్యతిరేకించినందుకు జెపిసిలోని ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేయడానికి కమిటీ చైర్మన్ ఎంచుకున్న కారణం చాలా పేలవంగా వుందని విమర్శించింది. కమిటీ వ్యవస్థకు సంబంధించి ఏళ్ళ తరబడి స్పష్టంగా రూపొందించుకుని, అనుసరిస్తూ వచ్చిన సాంప్రదాయాలన్నింటినీ తుంగలో తొక్కి చట్టబద్ధమైన పార్లమెంటరీ ప్రక్రియను దెబ్బతీయడం కన్నా మరేదీ దారుణం కాబోదని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరించే ఇటువంటి దారుణ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రతిఘటించేందుకు ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంట్ సార్వభౌమాధికారాన్ని గౌరవించే వారందరూ ఏక తాటిపైకి రావాలని పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

జనం మదిలో రాజ్యాంగం బిజెపి మనసులో మనువాదం

- మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం దేశానికే ప్రమాదకరం : బృందాకరత్

8



సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై అజశర్మ, నారాయణరాజు, నర్సింగరావు, లోకనాథం, తులసీదాస్, సురేంద్ర తదితరులు

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించాలి

- అభివృద్ధి ముసుగులో వనరులను దోచుకునే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి : వి శ్రీనివాసరావు
- పోలవరం ప్రాజెక్టు అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారు : ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ యు నారాయణరాజు
- 'ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు'పై విశాఖలో సదస్సు

5

గణతంత్ర వేడుకలకు రంగం సిద్ధం

- కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు
- అలరించనున్న వైమానిక విన్యాసాలు,
- ముఖ్య అతిథిగా ఇండొనేషియా అధ్యక్షుడు సుబియాంతో
- ఈ ఏడాది థీమ్ 'గోల్డెన్ ఇండియన్ హెరిటేజ్, అండ్ డెవలప్‌మెంట్'
- సర్పంచ్‌లు, కళాకారులకు ప్రత్యేక ఆహ్వానాలు

7

సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం

3

గ్రీవెన్స్‌సెల్ నిర్వహించిన మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డితో కలిసి శనివారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కర్నూలులోని కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీకి చెందిన రూ.300 కోట్ల విలువైన స్థలాన్ని అధికారులు, అక్రమార్కులతో కలిసి అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడుతున్నారని ఎస్‌సి, ఎస్‌టి రాష్ట్ర సంక్షేమ సంఘం సభ్యులు నాగన్న ఫిర్యాదు చేశారు. తనకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇప్పించాలని ఎపి ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ కుమార్ కోరారు.

31 వరకు గ్రీవెన్స్ నిర్వహణ జాబితా విడుదల

ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు గ్రీవెన్స్ నిర్వహించే మంత్రులు, పార్టీ నాయకుల జాబితాను టిడిపి కార్యాలయం విడుదల చేసింది. ఈ నెల 27న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఫైబర్ నెట్ ఛైర్మన్ జివి రెడ్డి పాల్గొంటారు. 28న మంత్రి ఎస్ సవిత, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నిర్వహిస్తారు. 29న మంత్రి అనగాని సత్యప్రసాద్, సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి, 30న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎపిసిఒజిఎఫ్ ఛైర్మన్ గండి బాబ్జి, 31న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మాజీ మంత్రి పీతల సుజాత నిర్వహిస్తారు.

వి.జి.కె మరణం ఐక్య ఉద్యమాలకు తీరని లోటు

- మంచి నిర్మాణ నైపుణ్యంగల ఆర్గనైజర్
- సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు


మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులపై పెద్దఎత్తున దాడి సాగిస్తున్న నేపథ్యంలో వి.జి.కె మూర్తి లేనిలోటు ఐక్య ఉద్యమాలకు తీరనిదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన సిపిఎం నేత వి.జి.కె మూర్తి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ట్రేడ్ యూనియన్లను ఐక్యం చేయడం, అందరూ ఆయన నాయకత్వాన్ని అంగీకరించేలా చేసుకోవడంలో చాలా నేర్పరితనం ప్రదర్శించారని తెలిపారు. ఉద్యమాల నిర్మాణంలో గొప్ప నిర్మాణ నైపుణ్యం గల వ్యక్తి మూర్తి అని కొనియాడారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో సమాజానికి ఏదో మేలు చేయాలనే తపన ఉన్న నాయకుల కొరత దేశం ఎదుర్కొంటోందన్నారు.

డబ్బు సంపాదనే లక్ష్యంగా సాగుతోన్న ప్రస్తుత రాజకీయాలకు మూర్తి తరహా వ్యక్తులు దేశానికి అవసరమని తెలిపారు. రాజకీయాల్లో మూర్తి ఒక ఆణిముత్యమని, నూతన రాజకీయ సంస్కృతికి మూర్తీభవించిన వ్యక్తిత్వం వి.జి.కె మూర్తి అని కొనియాడారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. కుటుంబపరంగా, ఆరోగ్యపరంగా కష్టాలు పడుతూనే సమాజానికి ఏదో చేయాలనే తపన కలిగిన వ్యక్తి మూర్తి అని అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లోని తిలక్ హాల్ నిర్మాణం పూర్తి చేయాలన్న ఆయన ఆశయాన్ని ఏడాదిలోగా పూర్తి చేసి, ఆయన పేరు పెడతామని ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి మతతత్వ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో సెక్యులర్ శక్తులను కూడదీసి ముందుకు నడిపించే వి.జి.కె మూర్తి లేకపోవడం జిల్లాకు పెద్ద నష్టమన్నారు. ఎల్ఐసిలో ఉద్యోగిగా ఉంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన సమ్మెలో అరెస్టు కావడం ఆయన నిబద్ధతకు నిదర్శమని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ మాట్లాడుతూ.. పాలస్తీనాలోని గాజాలో చిన్నారులపై బాంబులు విసిరి వారిని హతమారుస్తూ మానవత్వం లేకుండా అగ్రరాజ్యాలు రాక్షసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అంతా మానవత్వం వైపు నిలబడడమే వి.జి.కె మూర్తికిచ్చే ఘన నివాళి అని అన్నారు. దీనికి ముందు మూర్తి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన జీవిత చరిత్రను తెలిపే ఎవిని ప్రదర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు పి.సతీష్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు, వి.జి.కె మూర్తి కుమారుడు శ్రీనివాస కుమార్, కుమార్తెలు భారతి, స్రవంతి, ఇతర కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని సోదరి తోటకూరి సరోజిని మృతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోదరి, ఖమ్మం జిల్లా చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన తోటకూరి సరోజిని (70) అనారోగ్యంతో శనివారం మరణించారు. భౌతికకాయానికి ఆమె తమ్ముడు తమ్మినేని వీరభద్రం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపల్లెవాడ గ్రామంలో సిపిఎంకు ఆమె పునాదులు వేశారని అన్నారు. పార్టీ కార్యకలాపాలలో భర్తకి చేదోడువాదోడుగా ఉంటూ, సహకరిస్తూ ఉండేవారని చెప్పారు. అలాంటి వ్యక్తి ఈరోజు తమ మధ్యన లేకపోవడం తమ కుటుంబానికి తీరని లోటుగా భావిస్తున్నామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు కృష్ణమూర్తి కిరణ్‌బాబు తదితరులు నివాళులర్పించారు.

జమిలి ఎన్నికలతో ఉపయోగం లేదు

- అవినీతి, పేదరికంతో దేశం నిండిపోయింది : జయప్రకాష్ నారాయణ

ప్రజాశక్తి- విజయనగరం కోట

దేశంలో బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న జమిలి ఎన్నికల వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదని, ఈ నిర్ణయం కొండను తవ్వి ఎలుకను పట్టినట్టేనని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ అన్నారు. శనివారం విజయనగరం విచ్చేసిన ఆయన స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అవినీతి, నిరుద్యోగం, పేదరికంతో దేశం నిండిపోయిందన్నారు. దేశంలో ఎన్నికలు నిజాయితీగా జరుగుతున్నాయని, ఫెడరల్ వ్యవస్థ బలపడిందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు రాష్ట్రాల చేతిలో ఉందన్నారు. దేశంలో ఎంతోమందికి విద్య, వైద్యం సరిగా అందడం లేదని తెలిపారు. అధికారం ఒకే దగ్గర కేంద్రీకృతమై పోయిందన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీల అభివృద్ధి సరిగా జరగడం లేదన్నారు. చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ కోరుకున్న స్వరాజ్యాన్ని తీసుకురావాలన్నారు. రాజ్యాంగం అమలు కావాలంటే రాజకీయ పార్టీలు సరిగా పని చేయాలని సూచించారు. దేశ ప్రయోజనాలతో సంబంధం లేకుండా వ్యవహరిస్తే అందరికీ నష్టమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం సహాయం చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ, హంగామా చేయడం సరికాదని పేర్కొన్నారు. సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

ఓటుహక్కు ఎంతో విలువైనది

- సిఎస్ విజయానంద్


ఓటర్ల దినోత్సవ సందర్భంగా ప్రమాణంచేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వేచ్ఛాయుత ఎన్నికలపై మన వ్యవస్థ ఆధారపడి ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును నమోదు చేసుకోవాలన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ఓటుహక్కు ఎంతో అమూల్యమైనదని, ప్రజాస్వామ్య సమాజంలో పౌరునికి అత్యంత శక్తిమంతమైన అహింసా సాధనం ఓటుహక్కు అని అన్నారు. సభ ప్రారంభానికి ముందు గవర్నర్‌పేట పాత గవర్నమెంట్ ఆస్పత్రి నుంచి ఓటుహక్కు ప్రాముఖ్యతను తెలియజేస్తూ పలు కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిపి ఎస్‌వి రాజశేఖర్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ మాట్లాడుతూ.. తను రాష్ట్రానికి తాజా ఓటర్‌నని, నిబద్ధతతో ఓటు హక్కును సొంత ఊరిలో ఉపయోగించుకునేందుకు హైకోర్టుకు రెండుసార్లు వెళ్లి తన ఓటు హక్కును సాధించుకున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఓటు హక్కు వల్ల ఎలాంటి ఇబ్బంది పడకూడదనే సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ స్థాపించి ఓటర్ల హక్కును కాపాడటం, ఓటుహక్కు నిబద్ధతను చెప్పడం వంటి వాటికి శ్రీకారం చుట్టి గత ఎన్నికల్లో క్యాంపెయిన్ నిర్వహించామన్నారు. కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పురోగమనానికి ఓటు పునాది వంటిదని, ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. విజయవాడ పోలీస్ కమిషనరు ఎస్‌వి రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ.. ఎన్నికల్లో కుల, మత, జాతికి తావు లేకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డిఒ చైతన్య, ఎన్ఎస్ఎస్ స్టేట్ కో-ఆర్డినేటర్ చంద్రమౌళి, జిల్లా కో-ఆర్డినేటర్ కె రమేష్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బి యుగంధర్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవ రమేష్ పాల్గొన్నారు.

లక్ష్మీశాకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ పురస్కారం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశాకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు-2024 లభించింది. ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో లక్ష్మీశా... రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఆయనతోపాటు అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన, ఎన్నికల నిర్వహణ సమర్ధవంతంగా నిర్వహించిన పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు కూడా అవార్డులు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో ముఖేష్‌కుమార్ మీనా, ప్రవీణ్‌కుమార్, జె నివాస్, డికె బాలాజీ, వినోద్‌కుమార్, ఎంఎన్ హరేంధర్ ప్రసాద్, జి రాజకుమారి, దినేష్‌కుమార్, సగిలి షన్మోహన్, ఎ తమీమ్ అన్సారియా, పి రంజిత్ బాషా, బిఆర్ అంబేద్కర్, ఎస్ వెంకటేశ్వర్, స్వప్నిల్ దినకర్ పుండర్కర్, వి హర్షవర్ధన్‌రాజు, వకుల్ జిందాల్, పి జగదీష్, సిద్ధార్థ కౌశల్, పి కోటేశ్వరరావు (రిటైర్డ్), వెంకటరామిరెడ్డి (రిటైర్డ్) ఉన్నారు.

రాజీనామా పేరుతో విజయసాయిరెడ్డి ఎత్తులు

- మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజీనామా పేరుతో వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి ఎత్తులు, పైఎత్తులు, నక్కజిత్తులు వేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలపై పెత్తనం చేసి ఆ ప్రాంతాన్ని సర్వనాశనం చేశారని శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నెల్లూరుకు చెందిన ఆయనకు, ఆయన వియ్యంకుడికి అక్కడ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు.

ఇద్దరూ కలిసి ఉత్తరాంధ్రలో వేలకోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఏ కారణం లేకుండా చంద్రబాబును జైలుకు పంపించారని, 2029 నాటికి ఆయన ప్రాణాలతో ఉండకూడదని కోరుకున్న వ్యక్తి విజయసాయిరెడ్డి అని పేర్కొన్నారు.

సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్



- అమలుకు ప్రతినెలా 'థాలీ బజావో' • వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూపర్‌సిక్స్‌లో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలనూ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో శనివారం నిర్వహించిన 'థాలీ బజావో' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సూపర్ సిక్స్ అమలుకు నోచుకోనందుకు నిరసనగా ప్లేటును మోగిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫ్లాప్‌గా రికార్డు సృష్టించాయన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇస్తానని చెప్పిన రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. తల్లికి వందనం, మహాశక్తి, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం వంటివి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, ఈ ఏడాది ఇవ్వాల్సిన నాలుగు లక్షలు ఉద్యోగాల ఊసే లేదన్నారు. ప్రతియేటా జనవరి ఒకటిన జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పారని, ఈ ఏడాది జనవరి ముగుస్తున్నా విడుదల చేయలేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పి ఆ విషయంలోనూ మోసం చేశారని చెప్పారు. తొలి సంతకం పెట్టిన డిఎస్‌సి నోటిఫికేషన్‌కే దిక్కు లేదన్నారు. మరోవైపు గ్రూప్-1 అభ్యర్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామని చెప్పి, ఉన్న ఉద్యోగాలు లేకుండా చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. ప్రజలు హామీల గురించి అడిగితే రూ.10 లక్షల కోట్లు అప్పు ఉందని చంద్రబాబు చెబుతున్నారని, ఎన్నికలకు ముందే గత ప్రభుత్వం ఈ అప్పు చేసిందని, ఆ విషయం తెలిసే ఈ హామీలు మేనిఫెస్టోలో పెట్టారని చెప్పారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేసే వరకూ ప్రతినెలా 'థాలి బజావో' నిరసన తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి, పిసిసి నాయకులు నరహరిశెట్టి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయత కోల్పోయిన జగన్

వైసిపి అధినేత జగన్ నాయకుడిగా విశ్వసనీయత కోల్పోయారని షర్మిల విమర్శించారు. సన్నిహితులు, ప్రాణం పెట్టిన వాళ్లు జగన్‌ను వీడటానికి విశ్వసనీయత కోల్పోవడమే కారణమని అన్నారు. జగన్ చెప్పిందల్లా విజయసాయి చేశారని, వ్యక్తిగతంగా కూడా తన బిడ్డల విషయంలో అబద్ధాలు చెప్పారని తెలిపారు. బిజెపికి జగన్ దత్తపుత్రుడని, తనను తాను కాపాడుకోవడానికి విజయసాయిని ఆ పార్టీలోకి పంపే అవకాశం లేదని అన్నారు. వివేకా హత్య విషయంలో విజయసాయిరెడ్డి నిజం చెప్పినందుకు సంతోషమని, ఇతర విషయాల్లోనూ నిజాలు బయటపెట్టాలని సూచించారు.

'హత్య' సినిమాను వెంటనే నిలిపివేయాలి


- వివేకా హత్య కేసులో నిందితుడు సునీల్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ (కడప జిల్లా)

హత్య సినిమాను వెంటనే నిలిపివేయాలని, తనను, తన తల్లిని అనుమానించే విధంగా సినిమా తీశారని మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు యాదాటి సునీల్ కుమార్ యాదవ్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పులివెందుల పట్టణ సిఐ నరసింహులుకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. హత్య సినిమాలో తమ మనోభావాలు దెబ్బతినే విధంగా చిత్రీకరించారని, దీనిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కోర్టులో ప్రయివేట్ కంప్లైంట్ చేస్తామన్నారు. తనకు ప్రాణహాని ఉందని గతంలో జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశానని, న్యాయం జరగకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చెప్పారు. ఉన్నతాధికారులకు తెలియపరిచి వారి సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పినట్టు సునీల్ కుమార్ యాదవ్ తెలిపారు.

జానపద పరిశోధకులు
'తంగిరాల' కన్నుమూత

- నేడు అంత్యక్రియలు


తంగిరాల వెంకట సుబ్బారావు (ఫైల్)

ప్రజాశక్తి-పిసిపల్లి (ప్రకాశం జిల్లా)

జానపద పరిశోధకులు, సాహిత్య సేవకులు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు (90) శనివారం బెంగళూరులోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. వయోభారంతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య గతంలోనే మరణించారు. వెంకట సుబ్బారావుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకట సుబ్బావధానులు, సీతామహాలక్ష్మి దంపతులకు పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకా కాకులు ఇల్లిందలపర్రులో సుబ్బారావు 1935 మార్చి 30న జన్మించారు. ప్రాథమిక విద్య ఇల్లిందలపర్రులో, పాఠశాల విద్య రాజమండ్రిలో, ఇంటర్‌మీడియల్, బిఎ భీమవరంలో చదివారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఎ తెలుగు చదివి, అక్కడే 'తెలుగు వీర గాథ కవిత్వం'లో పిహెచ్‌డి పట్టా పొందారు. రాష్ట్రంలోని పలు గ్రామాల్లో తిరిగి వీరగాథలను సేకరించారు. కాటమరాజు కథలు, పల్నాటి వీరగాథలు సేకరించి గ్రంథస్తం చేశారు. పిహెచ్‌డి పట్టా వచ్చిన వెంటనే 1969లో బెంగళూరు యూనివర్సిటీలో కన్నడశాఖలో తెలుగు ఉపన్యాసకులుగా చేరారు. అంచెలంచెలుగా ఉద్యోగోన్నతి పొంది, యూనివర్సిటీలో తెలుగు శాఖ అధిపతిగా 1995లోఉద్యోగ విరమణ చేశారు. 2022లో తెలుగు వీరగాథలు సమగ్ర సంపుటిని రచించారు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే దేవరకొండ బాలగంగాధర్ తిలక్‌తో శిష్యుడిగా ఉంటూ 'తపాలా బంట్రోతు' అనే కవితను రాయించారు. వెంకట సుబ్బారావు సేవలకుగానూ అజోవిభో కందాళం వారు 32వ వార్షికోత్సవ సందర్భంగా విజయవాడలోని మాకినేని బసవపు పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జనవరి 4వ తేదీన జీవిత సాఫల్య పురస్కారం, రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. జానపద సాహిత్య సేవలో ఉన్న తంగరాల మతి పట్ల పలువురు కవులు, రచయితలు తమ సంతాపాన్ని తెలిపారు. ఆదివారం బెంగళూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు తంగిరాల శ్రీనాథ్ తెలిపారు.

'సొండి' సామాజిక తరగతి వారికి 4 మద్యం షాపులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తర కోస్తా కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న సొండి సామాజిక తరగతి వారికి నాలుగు మద్యం దుకాణాలు రిజర్వు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్ కుమార్ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2016 పల్స్ సర్వే ఆధారంగా ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం ఉత్తర కోస్తాలో అధిక జనాభా కలిగిన సొండి సామాజిక తరగతికి 4 షాపులు కేటాయించాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి జనాభా సంఖ్యను బట్టి శ్రీకాకుళం జిల్లాలో 2 షాపులు, విజయనగరం జిల్లాలో 1, పార్వతీపురం మన్యం జిల్లాలో 1 రిజర్వు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. గీత కార్మికులకు అందించిన విధంగానే వీరికి సబ్సిడీలు, చెల్లించబడని డిపాజిట్లు, ఇతర నిబంధనలన్నీ వర్తించనున్నాయి.


పోలీసుస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న యోగా ఇన్‌స్ట్రక్టర్లు

వేతనాలు అడిగితే బెదిరింపులా!

మోకాళ్లపై నిల్చొని యోగా శిక్షకుల నిరసన

'బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్'పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకులు తమతో పని చేయించుకుని గత రెండున్నరేళ్లుగా జీతాలు ఇవ్వలేదని, తమ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం టూటౌన్ పోలీసులు స్టేషన్ ఎదుట యోగా శిక్షకులు మోకాళ్లపై నిల్చొని శనివారం నిరసన తెలిపారు. ఫౌండేషన్ నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలియడంతో యోగా శిక్షకులు పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని హైస్కూల్‌లో ఉన్న విద్యార్థులకు యోగా శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్ ద్వారా 2021 నుంచి బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇచ్చిందని తెలిపారు. శిక్షణ అనంతరం అవుట్ సోర్సింగ్ విధానంలో ప్రభుత్వ పాఠశాలల్లో యోగా శిక్షకులుగా నియమించారన్నారు. శిక్షణ కాలంలో బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకులు సయ్యద్ వల్లి, లక్ష్మీనారాయణ తమ నుంచి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేశారని వెల్లడించారు. బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్ జీతాలు చెల్లించాల్సి ఉందని, మొదట్లో వేతనాలు చెల్లించి.. ఆ తరువాత చెల్లించడంలేదని తెలిపారు. వేతనాలు అడుగుతుంటే తమను చంపుతామని సంస్థ నిర్వాహకులు బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విజయనగరానికి చెందిన పలువురు బాధితులు 2024 మే 20న నిర్వాహకులు సయ్యద్ వల్లి, లక్ష్మణరావులపై పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో సంస్థ నిర్వాహకులపై కేసులు నమోదైనట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ కృష్ణమూర్తి స్పందిస్తూ బాధితులంతా తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు.

దీంతో, వారంతా పోలీసులకు ఫిర్యాదు చేసి తమ ఆందోళన విరమించారు. అయితే, ఈ కేసులను కొట్టివేయాలంటూ నిర్వాహకులు హైకోర్టులో స్వాష్ పిటిషన్ వేశారు. పోలీసు స్టేషన్లో లొంగిపోయి విచారణకు సహకరించాలని హైకోర్టు సూచించినా వారు స్పందించకపోవడంతో ఎట్టకేలకు వీరిని పోలీసులు గుంటూరులో అదుపులోకి తీసుకొని విజయనగరం టూటౌన్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

1న లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు

- 2014-19 మధ్య నిర్మించిన ఇళ్లకు బిల్లుల చెల్లింపు
- మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తణుకు నియోజకవర్గంలోని తేతలిలో ఫిబ్రవరి 1న సిఎం చంద్రబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందించే కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తారని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి వెల్లడించారు. అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన 1.14 లక్షల ఇళ్లను ప్రతి నియోజకవర్గంలో శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అందజేస్తారన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ (పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో) శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ సొంత ఇళ్లు కలిగి ఉండాలనేది సిఎం చంద్రబాబు ఆకాంక్ష అని అన్నారు. గత ప్రభుత్వ తీరుతో పేదలకు ఇళ్లు అందించే పథకం కుంటుపడిందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మళ్లీ గాడిలో పెట్టి అర్హులందరికీ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రం నుంచి వచ్చిన రూ.4,500 కోట్ల నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో ఇబ్బందులు తలెత్తాయన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో కుదేలైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలోనైనా పేదలకు ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో రూ.502 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడా ఇసుక కొరత సమస్య ఉందని గుర్తించి ప్రభుత్వం రూ.5.19 కోట్లు తక్షణం కేటాయించి ఉచిత ఇసుక అందే ఏర్పాట్లు చేసిందన్నారు. పిఎంఎవై పథకంలో భాగంగా ఏడు లక్షల ఇళ్లను ఈ ఏడాది డిసెంబరుకు పూర్తి చేయాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటి స్థలాలు అందించడానికి ఇప్పటికే మంత్రివర్గంలో నిర్ణయించామన్నారు. 2014-19 మధ్య కాలంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ.900 కోట్లు బిల్లులు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

రాయలసీమకు నిధులు కేటాయించాలి

- ఎస్‌సిల రుణాల మంజూరులో విఫలం : చింతామోహన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వెనకబడిన రాయలసీమ ప్రాంతానికి నిధులను కేటాయించాలని కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేశారు. దేశంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్‌సిలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రుణాలు మంజూరు చేయించడంలో విఫలమైందన్నారు. కార్పొరేట్లకు మాత్రం పెద్ద ఎత్తున బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతున్నారని విమర్శించారు. శనివారం కర్నూలులోని ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తిరుపతి రాష్ట్ర రాజధాని అవుతుందని జోస్యం చెప్పారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సంగమేశ్వరం వద్ద ఉయ్యాల ప్రాజెక్టు కంటే మరో ప్రాజెక్టును నిర్మించి ఈ ప్రాంతాన్ని సాగునీటి పరంగా అభివృద్ధి చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.వేల కోట్లు నిధులు ఖర్చు చేపడుతున్నా ఇంతవరకు పనులు పూర్తి కాలేదని, అక్కడ పెట్టే నిధులను రాయలసీమ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని చెప్పారు. ఎస్‌సి వర్గీకరణ పేరుతో దళితులను విభజించడం తగదన్నారు. ఎస్‌సిలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈరన్న హంతకులకు కఠిన శిక్ష


- ఎఫ్ఎల యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లా అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఎ) ఈరన్న దారుణ హత్యకు కారకులైన వారిని వెంటనే పట్టుకుని, కఠినంగా శిక్షించాలని ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈరన్న కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడంతోపాటు, అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు ఎం.పరంధామయ్య, బి.నర్సింహులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరమైనా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఫీల్డ్ అసిస్టెంట్‌లు భావించారని, ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు వచ్చి పడ్డాయన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి సమస్యలు విన్నవించడానికి ప్రయత్నించినా అనుమతే లభించలేదని తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ఎఫ్ఎలకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని చెప్పారు. వేలాది మందిని రాజకీయ కారణాలతో ఉద్యోగాల నుంచి అక్రమంగా తొలగిస్తున్నారని, ఇందుకు వ్యతిరేకంగా న్యాయస్థానాల నుంచి ఆదేశాలు తెచ్చుకున్నప్పటికీ ఫలితం శూన్యమన్నారు. సకాలంలో జీతాలు రాక, పెరుగుతున్న ధరలతో కుటుంబాలు గడవక ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలు పస్తులతో గడుస్తున్నాయని చెప్పారు.

మరపురాని మహోజ్వల ఘట్టం

బందరు కాలువలో పూడిక తీత



తెలుగునాట కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాగిన మహత్తర కార్యక్రమాల్లో ఒకటి బందరు కాలువలో పూడిక తీత. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఆహార పదార్థాల కొరత, చీకటి బజారు రాష్ట్రాన్ని అలముకున్న పరిస్థితులలో కారు చీకట్లో కాంతి రేఖలా కమ్యూనిస్టుల నాయకత్వాన బందరు కాల్వ పూడిక తీత కార్యక్రమం సాగింది. కమ్యూనిస్టు పార్టీ క్రమశిక్షణకు, సేవానిరతికి అదొక తార్కాణంగా నిలిచింది. ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోవడంతో సుందరయ్య పిలుపునందుకుని దాదాపు ఆంధ్రాలోని అన్ని ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు లక్షమంది కమ్యూనిస్టు కార్యకర్తలు ఏప్రిల్, మే మాసాల్లో మండు టెండలను సైతం లెక్క చేయకుండా ఎవరి పనిముట్లను వారే తెచ్చుకొని మైళ్లకొలది మేటవేసిన మట్టిని పూడిక తీయడం ఆ కాలంలో మరుపురాని మహోజ్వల ఘట్టం. ఈ ఉద్యమంలో కమ్యూన్ భోజన శిబిరం ఏర్పాటు, సహపంక్తి భోజనాలు చాలా మందికి ప్రేరణనిచ్చాయి.

ఐదు లక్షల 80 వేల ఎకరాలకు నీటి ఎద్దడిని తొలగించి, మరో 40 వేల ఎకరాలను పల్లపు సాగులోకి తెచ్చే బృహత్తర కార్యక్రమం అది. ఆ సందర్భంగా పుట్టుకొచ్చిన కొన్ని పాటలు ఎంతగానో ప్రాచుర్యం పొందాయి.

తవ్వాలి తవ్వాలి కూలన్న
కాలువలు తవ్వాలి కూలన్న
మనరైతు సంఘమే కూలన్న
ఎలుగెత్తి కేకేసే కూలన్న
జాగేల మనకింక కూలన్న

పూలుపాలెం వ్యవసాయ కూలీ దోనేపూడి సుదర్శనం ఉత్సాహంతో ఇలా పాడిస్తూ పనిచేస్తున్నాడు. పాటను రాసింది కూడా అతనే. తన తోటిపనివారు పాటనందుకొని ఉత్తేజితులవుతున్నారు. కాయకష్టంతోనే కాలం గడిపే యువకుడు సుదర్శనం. ప్రజల క్షేమ కోసం తన సంఘం తలపెట్టిన కార్యక్రమం అతనిని ఉత్తేజపరచింది. అతనిలో కవిత్వాన్ని కూడా రేకెత్తించింది. ఇంకా ఇలా పాడుతున్నాడు సుదర్శనం.

కాలువలు తవ్వాలి కూలన్న
కరువులు తీర్చాలి కూలన్న
మన దేశ గుమ్మాన కూలన్న
మాయ ఫాసిస్టులు కూలన్న
మరిక కాలుబెట్టారు కూలన్న
మనమంతా కలవాలి కూలన్న
జేజేలు కొట్టాలి కూలన్న

పూడిక తీత పనులు సకాలంలో పూర్తికావాలంటే, రోజుకు మూడువేల మంది పనిచేస్తుండాలని రైతు సంఘం పిలుపునిచ్చింది. 19వ తేదీనాటికి (1944, మే 19) సుమారు 2300 మంది మాత్రమే కూలీలు వచ్చారు. వీరిలో 7, 8 వందల మంది వ్యవసాయ కూలీలు, మిగతా వారు మట్టిపనిచేసే వారలు. కమ్యూనిస్టు పార్టీ తన వంతు సాయం చేసింది. రైతు, కూలీరంగాల్లో పనిచేస్తున్న ఇతర కామ్రేడ్స్ వేయి మంది వచ్చి కాలువ పని చేయాలని పిలుపునిచ్చింది. 19వ తేదీ నాటికి (1944, మే 19) 700 మంది కమ్యూనిస్టులు వచ్చి పలుగు పార పట్టారు. .

ఎర్రజెండాలు ప్రోత్సహిస్తుంటే
పిన్నలు-పెద్దలు

కాలువలో యనమలకుదురు లాకువైపు మట్టిపనివారలు, వ్యవసాయ కూలీలు, పార్టీ సభ్యుల జట్లు జట్లుగా ఏర్పడి పనిచేశారు. వీరిలో అన్ని తరగతుల రైతులు, విద్యార్థులు, కార్మికులు, పిల్లలు, పెద్దలు అందరూ ఉన్నారు. వంద ఎకరాల ఆసాములైన భీమవరపు కృష్ణారెడ్డి (ప్రొద్దుటూరు), గన్నే సత్యం (వల్లూరు) కూడా పార తవ్వి తట్టలెత్తారు.

కొత్త అనుభవం. సెలవురోజుల్లో అచ్చుపనివారు, ఇతర కార్మికులు వచ్చి, ఎవరికీ తీసుపోని ఉత్సాహంతో పనిచేశారు. బాలల సంఘం కూడా 'ఉడుతా సాయం' కొనసాగించింది. 13వ తేదీ నాడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, చలసాని వాసుదేవరావు, మద్దుకూరి చంద్రశేఖరరావు, కడియాల గోపాలరావు మొదలైన పార్టీ నాయకులంతా తలలకు గడ్డి చుట్టలు చుట్టి, తట్టా-పారా పట్టి పని చేస్తున్నప్పుడు కళ్లారా చూసిన వారిలో కలిగిన ఉత్సాహం అంతాఇంతా కాదు.

ఇరుగు పొరుగువారి తోడ్పాటు

వెలగపూడి రత్తయ్యగారు గుమ్మడికాయలు పంపారు. యనమల కుదురులోని కొందరు యువకులు ఎవరూ పిలవకుండానే వచ్చి పనిచేశారు. పనిపూర్తి చేసుకొని స్నానానికని ఎటో బయలుదేరిన రైతుకూలీ వర్కర్లనాపి - 'మా ఇళ్లలోనే నూతులున్నాయి - స్నానం చేయండి' అని ఆహ్వానించారు యనమలకుదురు రైతులు. నీళ్లు చేదుకోబోతే - 'ఇంతసేపు చేతులు పుళ్ళు చేసుకొని పని చేశారు. మీరెందుకు చేదడం' అని తామే చేది నీళ్లు పోశారు.

సమిష్టి జీవనం

అధికార వర్గానికీ, ప్రజాసంస్థలకు తారతమ్యం పనివాళ్లతో పనిచేయించడంలోనే కాదు, పని సాగుతున్నంతకాలం పనివారి నిత్య జీవనాన్ని గురించి శ్రద్ధ తీసుకోవడంలో కూడా ప్రజా సంఘాలు అధికార వర్గాలకు పాఠాలు నేర్పాయి. పనివారికి కంట్రోలు ధరలకు బియ్యం మొదలైన ఆహార పదార్థాల పరఫరాకు ఏర్పాట్లు చేశాయి. దెబ్బలు తగిలిన వారికి చికిత్స సౌకర్యాలనేర్పాటు చేశాయి. అన్నింటినీ మించినదేమంటే పగలంతా పనిచేసి అలసిపోయిన వారికి సాయంత్రం కొంత సేపు వినోద కార్యక్రమాలను కమ్యూనిస్టు పార్టీ, రైతుసంఘం, వైజ్ఞానిక దళాలు చేపట్టాయి. ప్రతిరోజూ అక్కడక్కడ బుర్రకథలు చెప్పాయి. దీంతో ఉత్తేజితులైన ముఠాలు మరునాడు ఇంకా ఉత్సాహంతో, పట్టుదలతో పనిలో ప్రవేశించాయి. కృష్ణాజిల్లా తెలుగురావుపాలెం ముఠా మనిషికి ఆరు గజాల చొప్పున తవ్వి తక్కిన ముఠాలతో బోల్షివిక్ పోటీకి దిగింది. ఈ ముఠాలో ఇద్దరే పార్టీ సభ్యులు. మిగతా వారందరూ వ్యవసాయ కూలీలు. గుంటూరు జిల్లా పార్టీ దళం అగ్రతాంబూలం పొందాలనే పట్టుదలతో పనిసాగించింది. ఇతర దళాలు రోజు రోజుకూ ఎక్కువ పని చేయాలనే దీక్షతో ఉరకలు వేశాయి.

ఉదయభారతి

'ఉదయభారతి గురుకులం' బెజవాడలోని ఒక జాతీయ పాఠశాల. దీని నిర్వాహకులు శ్రీ పాటిబండ్ల మాధవశర్మ గారు కవి, పండితుడు. సహృదయుడు, అభ్యుదయకరమైన ఏ విషయానికైనా చేయూతనిచ్చే ఆయన బందరు కాలువ పనిని, దానిని కొనసాగిస్తున్న దీక్షను చూసి ఉత్తేజితులయ్యారు. తన వంతు సాయం వెంటనే చేయాలనుకుని ఓ రోజు వేకువజామున తన శిష్య బృందాన్నంతటినీ, తోటి అధ్యాపకుల్నీ వెంటబెట్టుకొని కాలవ వద్దకు వచ్చి అందరికీ శక్తికి తగిన పని నిర్ణయించారు. తానూ పారపట్టారు. మోయగల బాలకులంతా తట్టలు మోశారు. గట్టుపైన ఖాళీ అయిపడుతున్న తట్టలను, పాలబుగ్గల పసిపాపలు కేరింతలు కొడుతూ కిందకు అందించారు. మరికొందరు బాలికలు మంచినీళ్లు అందించారు. చుట్టు పక్కల వారు ముగ్ధులైపోయారు. ఒక వైజ్ఞానిక దళం సంతోషం పట్టలేక వచ్చి అరగంటసేపు ఎంతో ముచ్చటగా పాటలు పాడి, వారిని ఆహ్లాదపరిచింది. ఇదేవిధంగా పటమట నుంచి ఒక ఉపాధ్యాయడు 20 మంది బాలలతో వచ్చి సాయం చేశారు. గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు స్వయంగా పారపట్టి పనిచేశారు. బెజవాడ రైల్వే కార్మికులు కొందరు, గుంటూరు నుంచి లాగడుబళ్ల పనివారూ కొందరు వచ్చారు. తమ ఇంటి అవసరాలకు బియ్యం మోస్తున్నారా అన్నంత ఉత్సాహంగా పనిచేశారు. 'షాపు ఎంప్లాయీస్ యూనియన్' సభ్యులు, తోళ్ల పనివారు మొదలైన అనేక కార్మిక సంఘాల వారు ప్రతివారం సెలవురోజుల్లో వెళ్లి పనిచేశారు. బెజవాడ ట్రేడ్ యూనియన్ సంస్థలన్నింటి తరపున వందమందికి పైగా వెళ్లి ఒకరోజు పని చేసి కార్మిక, కర్షక ఐక్యతను చాటారు. అంతేకాదు గ్రామ, పట్టణ ప్రజల సామరస్యానికి అదొక ఆమోఘమైన నిదర్శనంగా నిలిచింది.


గ్రామగ్రామాన ప్రచారం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట (నెల్లూరు)

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ జయప్రదం కోసం గ్రామగ్రామాన ప్రచారం నిర్వహిస్తున్నారు. నెల్లూరు జిల్లా ఎఎస్‌పేట మండల పరిధిలో పలు చోట్ల శనివారం వాల్‌పోస్టర్లను అతికించి, ఇంటింటికీ కరప్రతాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఎఎస్‌పేట మండల కార్యదర్శి నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



రైతు, కూలీ, చేనేతల నేస్తం
కొరటాల



జననం : 24.09.1923 మరణం : 01.07.2006

ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖుల్లో ఒకరు కొరటాల సత్యనారాయణ. ఆయన గుంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో 1926 సెప్టెంబరు 24న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు శేషమ్మ, పిచ్చయ్య. వీరిది స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కుటుంబం. రేపల్లె తాలూకాలోనే పెద్ద భూస్వామి అయిన కమ్మవారిపాలెంకు చెందిన తన మేనమామ కుమార్తె సుశీలను వివాహం చేసుకున్నారు. కొరటాల సుశీల దంపతులకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు, కుమార్తె.

1938-39 కాలంలో తురిమెళ్ల హైస్కూలులో చదువుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా సహ విద్యార్థులతో కలిసి తిరుగుబాటు చేశారు. అప్పటికాయన వయసు 14 సంవత్సరాలు మాత్రమే. డిటెన్షన్‌కు వ్యతిరేకంగా 11 రోజులు ఉద్యమించారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఉద్యమంపై మొండికేయడంతో కొరటాల నాటి గుంటూరు జిల్లా విద్యార్థి నాయకుడైన మాకినేని బసవపున్నయ్యను కలవాల్సి వచ్చింది. బసవపున్నయ్య జోక్యంతో ప్రధానోపాధ్యాయుడు దిగి వచ్చారు. దాంతో కొరటాల సమ్మె విరమించారు. అప్పుడే కొరటాలలో కమ్యూనిస్టు భావాల బీజం పడింది.

రేపల్లెలో చదువుతుండగా మోటూరు హనుమంతరావుతో ఏర్పడిన పరిచయం ఆయనను కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షితులయ్యేలా చేసింది. గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ (ఎసి) కళాశాలలో చదువుతున్నప్పుడు మాకినేని బసవపున్నయ్య, లావు బాలగంగాధరరావు సాహచర్యంలో చురుకైన కమ్యూనిస్టు కార్యకర్తగా మారారు. చదువుకు స్వస్తి చెప్పి రేపల్లె తాలూకాలో ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నారు. 1942-46 మధ్య కాలంలో కాంగ్రెస్ నుంచి పార్టీ తీవ్ర దాడులను ఎదుర్కొంది. వాటిని దీటుగా తిప్పికొట్టేందుకు వలంటీర్ల దళాలను తయారు చేశారు. కృష్ణానదీ లంక భూముల సమస్యపై నిరంతరం పోరాటాలు నడిపారు. పేద ప్రజలను సొసైటీలుగా ఏర్పరిచారు. భూస్వాముల అధీనంలోని ఆ భూములను పేదలు సాగు చేసుకునేలా పోరాటాలు నిర్వహించి, వాటిని వారు దక్కించుకునేలా కృషి చేశారు. రేపల్లె తాలూకాలో బంజరు భూములు పేదలకే దక్కాలని నిర్వహించిన పోరాటంలోనూ, చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటాల్లోనూ ముఖ్య భూమిక పోషించారు. నాడు జిల్లాలో సాగుకు యోగ్యమైన 50 వేల ఎకరాలు ఉండగా దానిలో 10 వేల ఎకరాలు పేదలకు అందేలా కొరటాల పోరాటాలు నిర్వహించారు. రొంపేరు చుట్టూ పేదలు, కూలీలు వేలాది ఎకరాల్లో సాగు చేపట్టారు. దాన్ని పేదలకు పంపిణీ చేయాలని చీరాల (నాడది గుంటూరు జిల్లాలో ఉంది)లో 30 వేల మందితో బంజరు భూముల సాధన సభ నిర్వహించారు. ముఖ్యకేంద్రాల్లో సత్యాగ్రహాలు, ప్రదర్శనలు చేపట్టారు. ఆ సందర్భంగా 700 మంది అరెస్టయ్యారు. చివరికి ప్రభుత్వం దిగొచ్చింది. ఈ ఉద్యమాలన్నిటిలో మోటూరు, కొల్లా వెంకయ్యతో కలిసి కొరటాల కీలక భూమిక వహించారు. నాగార్జునసాగర్ నిర్మాణం కోసం పార్టీలోని ఇతర నాయకులతో కలిసి ఉద్యమించారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో ఆయన విశేష కృషి చేశారు.

పలు మార్లు జైలుకెళ్లారు. నాలుగేళ్లపాటు అజ్ఞాతవాస జీవితం గడిపారు. 1948లో అజ్ఞాత జీవితంలో ఉండగా అరెస్టు చేసి బళ్లారి, కడలూరు జైళ్లలో నిర్బంధించారు. జైలులో ఉన్నప్పుడు 'కమ్యూనిజం-ఓనమాలు' పుస్తకాన్ని అనువాదం చేశారు. జైలులో పరిస్థితులకు వ్యతిరేకంగా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. 1975లో ఎమర్జెన్సీ ప్రకటనతో అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. విద్యార్థి ఫెడరేషన్ నాయకుడిగా మొదలై రేపల్లె ప్రాంత ఉద్యమ నిర్మాతగా, జిల్లా కార్యదర్శిగా రెండు పర్యాయాలు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా, రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా, పొలిట్‌బ్యూరో సభ్యునిగా పలు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు..ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘానికి, అలాగే వ్యవసాయ కార్మిక సంఘానికి రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు.

చేనేత రంగం గురించీ, చేనేత కార్మికుల జీవితాల గురించీ కొరటాల సాధికారికంగా మాట్లాడేవారు. ఒక విధంగా చెప్పాలంటే కొరటాల చేనేత సామాజిక తరగతికి చెందిన వ్యక్తి అనేకునేవారు కూడా లేకపోలేదు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం, ముఖ్యంగా వారికి మజూరీ పెంపుదల కోసం ఎంతో కృషి చేశారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ప్రభుత్వం వారిని ఆదుకునేలా చేనేత కార్మికుల పక్షాన అధికారుల వద్దకు రాయబారాలు నిర్వహించేవారు. అనేక చేనేత సత్యాగ్రహాలకూ, ధర్నాలకూ, ఉద్యమాలకూ నేతృత్వం వహించారు. శాసనసభా వేదికపైన కూడా చేనేత కార్మికుల దయనీయ పరిస్థితి గురించి ఇతరుల కన్నా మిన్నగా ఆయన ప్రస్తావించేవారు. వారి కష్టాలనూ, కన్నీళ్లనూ అక్కడ ప్రతిబింబించేవారు. 1982 జనవరిలో సిపిఎం 11వ అఖిల భారత మహాసభ విజయవాడలో జరిగినప్పుడు వంట విభాగం ఇన్‌ఛార్జిగా పనిచేశారు. యువకులు ఎదురైనప్పుడు ఏరా బాబూ, బాగున్నావా?, ఏం చేస్తున్నావ్? అని భుజమ్మీద చేయివేసి ఆప్యాయంగా పలుకరించేవారు. మేధావుల్లో మేధావిగా.. నాయకుల్లో నాయకుడిగా, కార్యకర్తల్లో కార్యకర్తగా, కుటుంబంలో పెద్దగా.. అందరితో ఇట్టే కలిసిపోయేవారు. కేన్సర్ మహమ్మారితో పోరాడి చివరికి 2006 జులై ఒకటో తేదీన తన 83వ ఏట హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయండి

- 'అనంత'లో ఐక్య విద్యార్థి సంఘాల ఆందోళన
- మంత్రి నారాయణ దిష్టిబొమ్మ దహనానికి యత్నం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేసి విద్యార్థి మరణానికి కారణమైన అనంతపురం నారాయణ కళాశాలను సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, నారాయణ సంస్థలను సీజ్ చేయాలని, ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ నారాయణ విద్యాసంస్థల అధినేత, రాష్ట్ర మంత్రి నారాయణ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అనంతపురంలో ఆందోళన చేపట్టారు. నగరంలోని లలితా కళాపరిషత్ నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. నారాయణ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు, విద్యార్థి సంఘం నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘం నాయకులు



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

మాట్లాడుతూ.. నారాయణ కళాశాలలో విద్యార్థి మరణానికి ఫీజుల ఒత్తిడే కారణమన్నారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా ఇప్పటి వరకు పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. విద్యార్థి మరణంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, విద్యార్థి మరణానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నుంచి నారాయణను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురంలో నారాయణ విద్యాసంస్థలకు తొత్తుగా పనిచేస్తున్న జిల్లా ఆర్‌ఐఒ వెంకటరమణను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించకుంటే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు, కార్యదర్శి ఓతురు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పథ్వి, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, జనసేన విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ.11,792 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : దేశంలోనే రెండో అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐసిఐసిఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 14.8 శాతం వృద్ధితో రూ.11,792 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.10,272 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.18,678 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో 9.1 శాతం వృద్ధితో రూ.20,370.6 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే 2024 డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 14.1 శాతం పెరిగి రూ.15,20,309 కోట్లుగా చోటు చేసుకున్నాయి. కరెంట్ ఎకౌంట్ డిపాజిట్లు 13.1 శాతం వృద్ధిని నమోదు చేశాయి. నికర దేశీయ అడ్వాన్సులు 15.1 శాతం పెరిగాయని ఆ సంస్థ తెలిపింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.96 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం సెప్టెంబర్ త్రైమాసికంలో జిఎన్‌పిఎ 1.97 శాతంగా చోటు చేసుకుంది.



బిఒఐ ఫలితాలు ఆకర్షణీయం

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 35 శాతం వృద్ధితో రూ.2,517 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1,870 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో బిఒఐ నికర వడ్డీ ఆదాయం 11 శాతం పెరిగి రూ.6,070 కోట్లకు చేరింది. నికర మొండి బాకీలు1.41 శాతం నుంచి 0.85 శాతానికి తగ్గాయి. స్థూల ఎన్‌పిఎలు 5.35 శాతం నుంచి 3.69 శాతానికి పరిమితమయ్యాయి.

తగ్గిన ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లాభాలు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ప్రయివేటు రంగంలోని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లాభాలు 53 శాతం తగ్గి రూ.339 కోట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.716 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 14 శాతం పెరిగి రూ.4,902 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.94 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి 2.04 శాతం జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. ఇదే సమయంలో 0.68 శాతంగా నికర నిరర్థక ఆస్తులు.. గడిచిన క్యూ33 ముగింపు నాటికి 0.52 శాతానికి తగ్గాయి.

యెస్ బ్యాంక్ లాభాలు మూడు రెట్లు..

ప్రయివేటు రంగంలో యెస్ బ్యాంక్ నికర లాభాలు మూడు రెట్లు పెరిగాయి. 2024-25 డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో రూ.612 కోట్ల నికర లాభాలు సాధించింది. మొండి బాకీలు తగ్గడంతో మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. 2023-24 ఇదే క్యూ3లో రూ.231 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.8,179 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో రూ.9,341 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2 శాతం నుంచి 1.6 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పిఎలు 0.9 శాతం నుంచి 0.5 శాతానికి పరిమితమయ్యాయి.

సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో శనివారం వేకువజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.మూడు కోట్ల విలువైన వస్త్రాలు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. ఉదయం ఐదు గంటల సమయంలో షాపింగ్ మాల్ నుంచి దట్టమైన పొగలు రావడంతో సెక్యూరిటీ సిబ్బంది, స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. నగరంలోని ఫైరింజన్లతో పాటు పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతం, విజయనగరం, విశాఖపట్నం నుంచి 12 అగ్నిమాపక శకటాలను తెప్పించారు. షాపింగ్ మాల్ గోడలను కూల్చివేసి హైడ్రాలిక్ ఫోమ్ ఇంజన్, విశాఖ నుంచి తెచ్చిన స్కై లిఫ్టర్‌తో కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. షాపింగ్ మాల్ నిర్మాణంలో కనీస భద్రతా ప్రమాణాలు లేకపోవడం వల్లే ఈ ప్రమాదానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పొగలు కమ్ముకున్న షాపింగ్‌మాల్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా పెడుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయమని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం చంద్రబాబు తన అనుయాయులకు వైద్య కళాశాలలు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ నిర్ణయంతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుడితే ఐదు కళాశాలలు ప్రారంభించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాశారని అన్నారు. ఇప్పటికే పార్వతీపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల టెండర్లు రద్దు చేశారని వివరించారు. చంద్రబాబు సన్నిహితుడైన మంత్రి నారాయణ, ఎన్ఆర్ఐ, జిఎస్ఎల్ వంటి సంస్థలకు మెడికల్ కళాశాలలు అప్పగించారని వివరించారు. ఈ ప్రైవేటు మెడికల్ కాలేజీ సీటు కోటి రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. పిజి సీటుకు రూ.3 కోట్లు వసూలు చేస్తున్నారన్నారు. వైద్య విద్యను పూర్తిగా కార్పొరేట్ సరుకుగా మార్చారని విమర్శించారు.

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

- ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగులోని సేవ్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరవు పీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. దేశంలో ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో అగ్రస్థానంలో ఎపిజిబి ఉందని, 552 శాఖలతో రూ.50 వేల కోట్ల టర్నోవర్‌తో రూ.802 కోట్ల లాభాలతో రూ.4591 కోట్ల రిజర్వ్‌తో వ్యాపారాభివృద్ధిలో మిగతా గ్రామీణ బ్యాంకుల కంటే అగ్రభాగాన ఉందని వివరించారు. రాష్ట్రంలో ఉన్న 4 గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తున్నందున, ఈ నాలుగు గ్రామీణ బ్యాంకుల్లో కడపకు సంబంధించిన ఎపిజిబి అన్ని రంగాల్లో వ్యాపార పరంగా అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఇక్కడ 2800 ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో కడప ప్రధాన కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో ఉన్న హైకోర్టు, లా యూనివర్సిటీ, ఎంఎస్ఎంఇ కేంద్రం, అనంతపురానికి రావాల్సిన ఎయిమ్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించి రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం చేశారని, ఈ ఒరవడిని ఇలా కొనసాగించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిజిపి యూనియన్ సంఘం నాయకులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

యాసిడ్ దాడి కేసులో నిందితుడిని పట్టించినందుకు..

ఎస్ఎఫ్ఐ నేత అజయ్‌కు సత్కారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కొద్ది రోజుల క్రితం ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న మహిళలపై యాసిడ్ దాడి చేసిన నిందితుడిని గుర్తించడంలో బాధ్యతగా వ్యవహరించిన ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు జి.అజయ్‌ను విశాఖ సిటీ పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు. అజయ్‌ను పోలీసు కమిషనరేట్‌కు ఆహ్వానించి ప్రత్యేకంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సామాజిక బాధ్యత, న్యాయం పట్ల ఎస్ఎఫ్ఐ బలమైన నిబద్ధతకు అజయ్ చూపిన తెగువ నిదర్శనమని కొనియాడారు.



అజయ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సిపి డాక్టర్ సిపి శంఖబ్రత బాగ్చి

ఏమి జరిగిందంటే..

గతేడాది నవంబర్ 29 రాత్రి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్‌టిసి బస్సు ఎక్కారు. ఐటిఐ జంక్షన్ వద్ద బస్సుపై గుర్తు తెలియని వ్యక్తి యాసిడ్ విసిరాడు. బస్సులో కిటికీ పక్కన కూర్చున్న ముగ్గురు మహిళలపై అది పడింది. దీంతో, వారు కళ్లు మండి కేకలు వేశారు. వెంటనే డ్రైవర్ బస్సును నిలిపేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కంచరపాలెం సిఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొని నిందితుడి కోసం గాలించారు. అజయ్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు.

నెలలో 8 లక్షల క్రెడిట్ కార్డుల జారీ



న్యూఢిల్లీ : దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం, జారీ భారీగా పెరుగుతోంది. 2024 డిసెంబర్‌లో కొత్తగా 8,20,000 క్రెడిట్ కార్డులు జారీ అయినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. అంతక్రితం నవంబర్‌లో కొత్తగా 3.50 లక్షల కార్డులు జారీ అయ్యాయి. గడిచిన నెలలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అత్యధికంగా 3.12 లక్షల కార్డులను అందించగా.. ఎస్‌బిఐ కార్డ్స్ 2.09 లక్షల కార్డులను వినియోగదారులకు అందించింది. ఆ తర్వాత స్థానంలో ఐసిఐసిఐ బ్యాంక్ 1.50 లక్షల కార్డులు జారీ చేసింది. పెళ్లిళ్ల సీజన్, ఏడాది ముగింపు పండగల సమయంలో ఖర్చులు అధికమవడం ఈ కార్డుల పెరుగుదలకు కారణమైందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2024 డిసెంబర్‌లో క్రెడిట్ కార్డుల వ్యయాలు దాదాపు 11 శాతం పెరిగి రూ.1.9 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

హిండ్‌వేర్ టైల్స్ బిజినెస్ సిఇఒగా నిరుపమ్ సహాయ్



న్యూఢిల్లీ : హిండ్‌వేర్ లిమిటెడ్ తన బాత్ అండ్ టైల్స్ వ్యాపారానికి కొత్త సిఇఒగా నిరుపమ్ సహాయ్‌ను నియమించింది. తన శానిటరీవేర్, కుళాయిలు, టైల్స్ వ్యాపారాల తదుపరి అభివృద్ధి దశకు ఆయన నాయకత్వం వహించనున్నారని ఆ కంపెనీ తెలిపింది. డిక్సన్ టెక్నాలజీస్ నుండి వచ్చి ఆయన హిండ్‌వేర్‌లో చేరారు. డిక్సన్‌లో లైటింగ్ సొల్యూషన్స్ బిజినెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కెరీర్‌లో ఫిలిప్స్ లైటింగ్, జిఇ క్యాపిటల్, వర్ల్‌పూల్, ఏషియన్ పెయింట్స్‌లను కీలక హోదాల్లో పని చేసిన అనుభవం ఉంది.

దేశంలోనే తొలి లిథియం రిఫైనరీ

- వర్ధబమాన్ లిథియం వెల్లడి

నాగ్‌పూర్ : దేశంలోనే తొలి లిథియం రిఫైనరీని తాము ఏర్పాటు చేస్తోన్నట్లు వర్ధమాన్ రిఫైనరీ ఛైర్మన్ సునీల్ జోషి, డైరెక్టర్ వేదాంష్ జోషి తెలిపారు. రూ.42,532 కోట్లతో నాగ్‌పూర్ సమీపంలో దీన్ని అందుబాటులోకి తెస్తోన్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్ సమీక్షంలో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. 500 ఎకరాల్లోని ఈ ప్లాంట్‌లో ప్రతీ ఏడాది 60వేల టన్నుల లిథియం రిఫైన్ చేయడం ద్వారా 20గిగావాట్ బ్యాటరీలను తయారు చేయనున్నామన్నారు.

సంపాదకీయం


జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును

నేడు దేశాన్ని పట్టిపీడిస్తున్న వాటిలో కులం, మతం, జాతుల సమస్యలు ముఖ్యమైనవి. చరిత్రలో మతం ప్రజలను ఏకం చేసిన దృష్టాంతాల కన్నా వైషమ్యాలు, విద్వేషాలు రెచ్చగొట్టే దుస్సంఘటనలే ఎక్కువగా కనిపిస్తాయి. దేశవిభజన సందర్భంగా చెలరేగిన మతఘర్షణలు, అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత, మైనార్టీలపై మూకదాడులు, మత అల్లర్లు ఇందుకు కొన్ని ఉదాహరణలు. మత ఉన్మాదం, పరమత ద్వేషం వంటివి చరిత్రలో అనేక సందర్భాల్లో రక్తపాతానికి దారితీశాయంటే అతిశయోక్తి కాదు. 'మనిషిని మంచి బాటలో నడిపించే కళ్లెమన్న మాటేమోగాని కత్తికటార్లిచ్చి ఉన్మాదప్పురెక్కించడం మాత్రం చరిత్రనిండా నిండిన ఖరాబు' అంటారో రచయిత. దేశంలో మనిషి పుట్టుకను బట్టి మత ముద్ర పడుతోంది. మత భావన, విశ్వాసం, మతాభిమానం ఉగ్గుపాలతో రంగరించి పోస్తున్నారు. ఇది క్రమేణా దురభిమానంగా, పరమత విద్వేషంగా మారితే జరిగే పరిణామాలేమిటో దేశం చూసింది. పాలకవర్గాల చేతిలో ఇదొక ఆయుధంగా మారుతోంది. 'ఎల్లలోకము వొక్కయిల్లై - వర్ణ భేదములెల్ల కల్లై/ వెల నెరుగని ప్రేమబంధము- వేడుకలు కురియ/ మతములన్నియు మాసిపోవును- జ్ఞాన మొక్కటే నిలిచి వెలుగును' అంటారు గురజాడ. ఆయన ఈ స్వప్నానికి సరిగ్గా 114 సంవత్సరాలైంది. ఈనాటికీ ఆయన కోరుకున్న సమాజం రాలేదు.

మతం వ్యక్తిగతం. మతాన్ని, రాజకీయాలను కలగాపులగం చేయకూడదు. మత స్వేచ్ఛవేరు, రాజకీయాల్లో మతాన్ని చొప్పించడం వేరు. ప్రస్తుతం అధికారంలో వున్న బిజెపి... ఈ రెండింటినీ కలగాపులగం చేసింది. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం (సిఎస్ఎస్ఎస్) నివేదిక ప్రకారం.. భారతదేశం 2024లో 59 మతపరమైన అల్లర్లను చూసింది. 2023లో జరిగిన 32 అల్లర్లతో పోల్చితే ఇది 84శాతం ఎక్కువ. ముఖ్యంగా మతపరమైన పండుగలు, ఊరేగింపుల సమయంలో ఈ అల్లర్లు జరిగినట్లు ఈ నివేదిక వెల్లడించింది. వీటిలో ఏడు సంఘటనలు గోహత్య ఆరోపణలతో ముడిపడి వున్నాయి. మతం పేరిట ఏ వికృతమైనా చెలామణి అయినట్లే... మొత్తం ఈ అల్లర్లలో అత్యధికం ముస్లిములు లక్ష్యంగా జరిగినవే. ఈ మత విద్వేషాల విచ్చుకత్తుల ధాటికి భారతీయ సాంస్కృతిక ఔన్నత్యం ఛిద్రమౌతోంది. 'ఇది 21వ శతాబ్దం. మతం పేరిట మనమెక్కడికి దిగజారిపోతున్నాం... విద్వేష నేరాలను ఉపేక్షిస్తే, ఏదోకనాటికి అవి మీ తలుపూ తడతాయి. ఆపై అమాయకుల ప్రాణాలెన్నో కడతేరిపోతాయి' అని ఓ సందర్భంలో సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. 'ప్రసార మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న విద్వేష వ్యాఖ్యలకు భారత ప్రభుత్వం మౌన ప్రేక్షకురాలిగా మిగిలిపోతోందెందుకు? దీన్నో స్వల్ప విషయంగా భావిస్తున్నారెందుకు?' అని కూడా లోగడ కేంద్రాన్ని తీవ్రంగానే మందలించింది. విశేషమేమిటంటే- ఈ మతపరమైన అల్లర్లన్నీ బిజెపి పాలిత లేదా ఇతర పార్టీలతో సంకీర్ణంలో పాలన చేస్తున్న రాష్ట్రాల్లోనే జరిగాయి.

మతం మర్రిచెట్టులా విస్తరించింది. అజ్ఞానమే జ్ఞానమై రాజ్యమేలుతున్నది. ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకొని, అజ్ఞానానికి సరికొత్త వ్యాఖ్యానాలు జోడించి జనం మీదికి చిమ్ముతున్నారు. ప్రశ్నించిన వాళ్లను వెంటాడి, వేటాడి హింసిస్తున్నారు. 'దేశ మనియెడి దొడ్డ వృక్షం/ ప్రేమలను పూలెత్త వలెనోయి' అంటారు గురజాడ. ప్రజల మధ్య విద్వేషాగ్నులు రగిలించే వారికి ఈ ఒక్కమాట చాలు. కులం, మతం, జాతి, వర్ణం వంటి ముక్కలు ముక్కలైన ఇరుకైన గోడల మధ్య ప్రపంచం మగ్గిపోకూడదు. 'కుల మతాలను వొదిలిపెట్టడం ఒక మహత్కార్యం కాదు. కాని వొదిలిపెట్టలేకపోవడం అల్పత్వం, భీరుత్వం, అంధత్వం. వీటన్నిటికన్నా గొప్పది అసలైన మనిషితనం' అంటారు చలం. మానవ ప్రేమ పునాదిగా కులమతాల ప్రసక్తిలేని అసలైన లౌకిక భారతదేశం ఆవిర్భవించేదాకా... జ్ఞానమయమైన సమాజం రూపొందేదాక... లౌకిక, భౌతిక, ప్రజాతంత్ర వాదులంతా విజ్ఞానం స్వేచ్ఛగా మనగలిగే ప్రపంచం కోసం, మత సామరస్యం కోసం ప్రతినబూనాలి.

మహనీయుని మాట




సనాతన ఆచారాలు, సాంప్రదాయాలు కూడా ప్రమాదకర శత్రువులే. విప్లవ పురోగమనాన్ని అవి అంతర్లీనంగా అడ్డుకుంటాయి. మనం వాటిని అణచివేయలేంగానీ...సుదీర్ఘ కాలంలో అత్యంత జాగరూకతతో, పట్టుదలతో వాటిని సరిచేయాల్సి వుంది.

- హోచిమిన్



దేశానికి రిపబ్లిక్ డే సంకేతాలు

ప్రస్తుతం



తెలకపల్లి రవి

ఈ రోజు దేశ వ్యాపితంగా రిపబ్లిక్ డే అంటే గణతంత్ర దినోత్సవం. దేశ రాజధానిలో భారత దేశ సైనిక పాటవాన్ని ప్రదర్శించడంతో పాటు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన శకటాలను కూడా ప్రదర్శిస్తారు. 75 ఏళ్ల కిందట భారత రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకొచ్చిన రోజు. వివిధ పత్రికలలో రాజ్యాంగ రూపకల్పన చరిత్ర, ప్రాథమిక హక్కులు, మౌలిక స్వభావం, సుప్రీంకోర్టు తీర్పులు తదితర విషయాలపై జాతీయ పత్రికల్లోనూ తెలుగులోనూ చాలా వ్యాసాలు వెలువడ్డాయి. ఈ సందర్భంలో టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రధాన వ్యాసం '75 ఏళ్ల తర్వాత కూడా ముమ్ముందుకు...' అనే శీర్షికతో వ్యాసం వెలువడింది. బిజెపి జాతీయ కార్యదర్శి రాసిన వ్యాసం తెలుగులో వచ్చింది. రాజ్యాంగాన్ని వలసవాద పత్రం అని కొంతమంది పేర్కొనడం సరికాదని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో భారతీయమేదీ లేదని ఆరోపించిన సంస్థ సాక్షాత్తూ ఆరెస్సెస్ మాత్రమేనని ఆ కుదురు నుంచే వచ్చిన నేతలకు తెలియకపోవడం ఆశ్చర్యమే. అప్పట్లో రాజ్యాంగ నిర్మాతలు అమెరికా, బ్రిటన్, కెనడా, స్విట్జర్లాండ్ వంటి దేశాల రాజ్యాంగాలను కూలంకషంగా అధ్యయనం చేస్తే దానికి మింగుడు పడలేదు. రాజ్యాంగంలో భారతీయతే లేదని దాన్ని ఆమోదించిన రోజునే వారి అధికార పత్రిక 'ఆర్గనైజర్'లో రాశారు. ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం రెండే జాతీయ పర్వదినాలుగా జరుగుతూ వచ్చాయి. మోడీ నవంబరు 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్తు ఆమోదించిన రోజు అంటూ దానికి రాజ్యాంగ దినోత్సవం పేరు పెట్టారు. 2015లో అధికారికంగా తీసుకున్న ఈ నిర్ణయం జనవరి 26 రిపబ్లిక్ డే ప్రాధాన్యత తగ్గించేందుకే.

జనవరి 26 ఎందుకు?

1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమలులోకి తీసుకురావడం స్పష్టమైన అవగాహనతో జరిగింది. 1930 జనవరి 26న పూర్ణస్వరాజ్ దినోత్సవం జరపాలని కాంగ్రెస్ జాతీయోద్యమ కాలంలో ఇచ్చిన పిలుపును గుర్తు చేసుకోవడానికి ఈ తేదీని తీసుకున్నారు. కాని కాంగ్రెస్ 'పూర్ణ స్వరాజ్' పిలుపునివ్వడానికి రంగం సిద్ధం చేసింది కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం. కాంగ్రెస్‌తో విభేదించి 'స్వరాజ్య పార్టీ' పెట్టుకున్న మోతీలాల్ నెహ్రూ ప్రభృతులు పరిమిత ప్రతిపత్తితో అధికారం పంచుకోవడానికి సిద్ధమవుతున్నారు. దేశ ప్రజలకు సమ్మతించదగిన రాజ్యాంగం ఇవ్వాలని 1924లో స్వరాజ్ పార్టీ తీర్మానం చేసింది. 1920లో తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీకి అంకురార్పణ జరిగిననాటి నుంచి సంపూర్ణ స్వరాజ్యం కోరుతూ వచ్చారు. 1921 అహ్మదాబాద్ కాంగ్రెస్ మహాసభలో వారే పూర్తి స్వాతంత్ర్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మళ్లీ 1927లో మద్రాసు కాంగ్రెస్ మహాసభలో జవహర్‌లాల్ నెహ్రూ పైన చెప్పినట్టు పూర్ణ స్వరాజ్ కోసం 1930 జనవరి 26న పతాకావిష్కరణలు చేయాలని తీర్మానం ప్రవేశ పెట్టినపుడు బలపర్చిన ప్రతినిధి జోగ్లేకర్ కమ్యూనిస్టు నాయకుడే. 1947లో దేశానికి స్వాతంత్రం కూడా ఆ తేదీనే ప్రకటించవచ్చునని మొదట భావించారు. అయితే ఘోరమైన మత కలహాల కల్లోలం రీత్యా కాస్త ముందుకు జరిపి ఆగస్టు 15నే ప్రకటించారు. 1948 జనవరి 26న ఈ విషయాలు సభల్లో చెప్పారు కూడా. నిజంగానే 1948 జనవరి 30న గాంధీజీని మతశక్తులు హత్య చేయడంతో ఆ భయాలు నిజమైనాయి.

> ఇప్పుడు ప్రధాని చేతుల్లో విపరీతాధికారాలు పోగుపడుతున్న ప్రస్తుత పరిస్థితి పరోక్ష అధ్యక్ష తరహాకు దారితీస్తున్నదనే విమర్శలు వింటూనే వున్నాం. ఇది రిపబ్లిక్ డే నాడు శకటాలను ఇష్టానుసారం తిరస్కరించడంలోనూ కేంద్ర పెత్తనమే గోచరిస్తుంది. జమిలి ఎన్నికల బిల్లు దాన్నే ప్రతిబింబిస్తుంది. పౌరులందరికీ సమాన హక్కులు, ప్రజలచే ఎన్నిక కావడం, లౌకికతత్వం, సమాఖ్యతత్వం అన్నవి మన రాజ్యాంగానికి మౌలిక లక్షణాలు. వీటిపై జరుగుతున్న దాడులు అందుకు వ్యతిరేకంగా పోరాటాలు గమనిస్తే 75 ఏళ్ల రిపబ్లిక్ సన్నివేశం కళ్లకు కడుతుంది.



గాంధీజీ హత్య, అంబేద్కర్‌కు అవమానం

1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలు మొదలుపెట్టే నాటికి దేశం మత కలహాల ముప్పునూ సామరస్యత, లౌకికతత్వం ఆవశ్యకతనూ గుర్తించగలిగింది. గాంధీజీ హత్యకు శిక్ష విధించబడిన గాడ్సేను దేశ భక్తుడుగా చెప్పేవారు. ఆయన గురువైన వీరసావర్కార్‌ను పార్లమెంటులో ప్రతిష్టించినవారు దేశాధిపత్యం చేపట్టిన ఫలితమిది. రాజ్యాంగ స్ఫూర్తిపై దాడికి నవంబరు 26 నిర్ణయం తొలి అడుగు మాత్రమేనని తర్వాత వరుసగా జరుగుతున్న మార్పులు, చర్యలు, తాజాగా తీసుకొచ్చిన జమిలి ఎన్నికల బిల్లులు వంటివన్నీ స్పష్టం చేస్తున్నాయి.

లిఖిత రూపంలో ప్రపంచంలో మరే దేశానికి లేనంత పెద్దది భారత రాజ్యాంగం. దానికోసం జరిగిన లోతైన చర్చలలో 36 లక్షల పదాలు వున్నాయని రికార్డులు చెబుతున్నాయి. 7635 సవరణలు లేదా ప్రతిపాదనలలో 2473 వివరంగా చర్చించి నిర్ధారణలకు వచ్చారు. 395 అధికరణలు, 8 షెడ్యూళ్లలో వీటిని పొందుపర్చారు. ఆరోగ్యం అంత బాగాలేనప్పటికీ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ దానికి తుది రూపమివ్వడానికి అంకితమైనారని రాజ్యాంగ పరిషత్ చైర్మన్ తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. దాదాపు 300 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఇంచుమించు మూడేళ్ల పాటు శ్రమించి, చర్చించి, తర్కించి, వాదించి, శోధించి దాన్ని జాతికి అందించారు. మొదట ఇందుకు సంబంధించిన ఎజెండా ప్రతిపాదిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ ఇది మన సంకల్పం అని, ప్రతిజ్ఞ అనీ ప్రకటించారు. ఆయనే మళ్లీ తొలి ప్రధానిగా అధికారం స్వీకరిస్తూ ప్రపంచమంతా నిద్రలో వున్న ఈ సమయంలో భారతదేశం స్వాతంత్ర్య యుగోదయంలోకి ప్రవేశిస్తున్నదని ప్రకటించారు. నిరంతర అప్రమత్తతే స్వాతంత్ర్యానికి రక్ష అన్నది శాశ్వత సూక్తి. రాజ్యాంగ రూపకల్పనలోనూ ఆమోదించి అమలుకు తేవడంలోనూ స్వాతంత్ర్య యోధులు, న్యాయ కోవిదులు, దేశభక్తులు ఆదర్శంగా పెట్టుకున్న లక్ష్యాలకూ ఈ నాటి పరిస్థితికి పొంతన ఏమైనా వున్నదా అని బేరీజు వేసుకోవాలి. ఎందుకంటే రాజ్యాంగం అమలు తీరుకు నిజమైన కొలబద్ద అని చెప్పిన అంబేద్కర్ పేరును...పదేపదే ప్రస్తావించడం కన్నా దేవుడి పేరు తలచుకుంటే పుణ్యం వచ్చేదని...అమిత్ షా రాజ్యాంగ వార్షికోత్సవ చర్చలోనే అనడం ఇందుకు నిదర్శనం.

స్ఫూర్తికి ఎసరు

దేశమంటే మనుషులోయ్ అన్నట్టే రాజ్యాంగం అంటే దాని మౌలిక స్వభావమే, ఇచ్చే నిర్దేశమే తప్ప నిర్జీవ నిబంధనలు కాదు. రాజ్యాంగం 368వ అధికరణం పరిస్థితులకు తగినట్టు దాన్ని మార్చుకునే అధికారం ఇస్తున్నదని మొదట పేర్కొన్న టైమ్స్ వ్యాసం చెబుతుంది. రాజ్యాంగం మౌలిక స్వభావం సిద్ధాంతం కూడా తర్వాత కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిందే తప్ప అందులోది కాదని ఆ వ్యాసకర్త అంటారు రాజ్యాంగంలో ఏదీ పరమ పవిత్రం కాదని స్వయంగా రెండో స్థానంలో వున్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఇటీవల వాక్రుచ్చారు. ఏది ఎలాగైనా మార్చేయొచ్చన్నట్టయితే ఇక దేశాలకు రాజ్యాంగాల అవసరమే వుండదు. ఒక విధాన చట్రంగా మూల సూత్రాలుగా వాటి పరిధిలోనే వ్యవహరించాలన్నది ఇక్కడ కీలకం. 368 ప్రకారం పార్లమెంటులో బలం వుంది గనక ఏది ఎలాగైనా తలకిందులు చేస్తామంటే చెల్లుబాటు కాదు, కాకూడదు.

స్వభావ రీత్యా ప్రజాస్వామికం, రాజరికం రెండు రకాలు (డెమోక్రసీ, మోనార్కీ). పాలనాపరంగా అధ్యక్ష తరహా, పార్లమెంటరీ తరహా (ప్రెసిడెన్షియల్ పార్లమెంటరీ) అధ్యక్ష తరహా, అధ్యక్ష తరహా పార్లమెంటరీ మిశ్రమం, పూర్తి పార్లమెంటరీ తరహా అనే మూడు విధానాలు ప్రపంచంలో వున్నాయి. అధ్యక్ష తరహాలో అన్నీ అధ్యక్షులే శాసిస్తారు. మిశ్రమ తరహాలో ప్రధాని, అధ్యక్షుడు (రాష్ట్రపతి) ఉభయులూ పార్లమెంటుకు బాధ్యత వహిస్తారు. మరికొన్ని చోట్ల అధ్యక్షుడే ప్రధానిని ఎంపిక చేస్తూ పాలన చేస్తాడు. మిశ్రమ పద్ధతిలో కొన్ని చోట్ల అధ్యక్షుడు కొన్ని చోట్ల ప్రధాని కీలక పాత్ర వహిస్తారు. మన దేశంలో రాష్ట్రపతి నామమాత్రం కాగా ప్రధాని సలహాపైనే నిర్ణయాలు తీసుకుంటాడు. ఈ విధానాన్ని కూడా ఇష్టప్రకారం మార్చేసే వీలుండదు. మన చుట్టుపక్కల శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ వంటి చోట్ల వీటిని అటూ ఇటూ మార్చిన ఉదాహరణలున్నాయి. వాటిని కోర్టులు కొట్టివేసిన సందర్భాలూ వున్నాయి. రాజకీయ వ్యవస్థ బలహీనంగా వున్నచోట్ల సైనిక బలంతో అమలు చేసిన హెచ్చరికలూ వున్నాయి. లీడ్ 1 ఇప్పుడు ప్రధాని చేతుల్లో విపరీతాధికారాలు పోగుపడుతున్న ప్రస్తుత పరిస్థితి పరోక్ష అధ్యక్ష తరహాకు దారితీస్తున్నదనే విమర్శలు వింటూనే వున్నాం. ఇది రిపబ్లిక్ డే నాడు శకటాలను ఇష్టానుసారం తిరస్కరించడంలోనూ కేంద్ర పెత్తనమే గోచరిస్తుంది. జమిలి ఎన్నికల బిల్లు దాన్నే ప్రతిబింబిస్తుంది. పౌరులందరికీ సమాన హక్కులు, ప్రజలచే ఎన్నిక కావడం, లౌకికతత్వం, సమాఖ్యతత్వం అన్నవి మన రాజ్యాంగానికి మౌలిక లక్షణాలు. వీటిపై జరుగుతున్న దాడులు అందుకు వ్యతిరేకంగా పోరాటాలు గమనిస్తే 75 ఏళ్ల రిపబ్లిక్ సన్నివేశం కళ్లకు కడుతుంది.

జవాబుదారీ తనం మాయం

రాజ్యాంగాన్ని భారత ప్రజలమైన మేము మాకు ఇచ్చుకుంటున్నాము అని పేర్కొంటున్నాం. అంటే వ్యవస్థలో జరిగిన దానికి, చేసిన దానికి ఎవరో ఒకరు అందరికీ జవాబుదారీగా వుండాలి. అధ్యక్ష తరహా పార్లమెంటరీ తరహా ఏదైనా సరే. మనం తీసుకున్న పార్లమెంటరీ వ్యవస్థలో అందరూ రాజ్యాంగానికి జవాబుదారీ. కేంద్రంలో వారు పార్లమెంటుకు రాష్ట్రాలలో పాలకులు శాసనసభలకూ జవాబుదారీ. ఓటర్ల ఆమోదంతో ఎన్నికై అధికారం చేపట్టి విధానాలు చట్టాలు రూపొందించేవారు సుప్రీంకోర్టుకు జవాబుదారీ. అంటే వారు చేసిన చట్టాలు రాజ్యాంగ నిబంధనలకు లోబడి వున్నాయా లేదా అని సుప్రీంకోర్టు హైకోర్టు చెబుతాయి. న్యాయ వ్యవస్థ కూడా రాజ్యాంగ పరిధిలో పని చేయవలసిందే. ఏ వ్యవస్థా రాజ్యాంగానికి అతీతం కాదు. అయితే జవాబుదారీతనం సమిష్టిగానూ వ్యక్తిగతంగానూ వుంటుంది. ఉదాహరణకు సభల్లో బలాన్ని బట్టి ప్రధాని, ముఖ్యమంత్రి నియామకం జరిగాక మంత్రివర్గం దాని తరపున నాయకులుగా వున్న ప్రధాని లేదా ముఖ్యమంత్రి సభకు బాధ్యత వహించాలి. అంతర్గతంగా ఆ యా శాఖలు లేదా విభాగాలు చూసేవారు ముఖ్యమంత్రికి, ప్రధానికి, ప్రభుత్వాలకు బాధ్యత వహించాలి. ఇది విస్తృతమైన విభజన. కానీ రాజధానుల నుంచి ప్రాజెక్టుల వరకూ దేశమంతటా కొనుగోళ్ల నుంచి నిధుల వరకూ ఎన్ని తప్పులు జరిగినా ఎన్ని కేసులు నడిచినా పూర్తి బాధ్యత ఎవరిదనేది తేల్చడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా అస్మదీయులు తస్మదీయులనే ప్రాతిపదికన వెళ్లడం కోర్టులలోనూ రకరకాల తీర్పులు రావడం జరిగిపోతుంది. అదానీ విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం, పోలవరం, అమరావతి, బీహార్‌లో, గుజరాత్‌లో బ్రిడ్జిలు పతనం ఎన్ని సంచలనాత్మక తప్పిదాల్లో బాధ్యత తేల్చారా? గుజరాత్ మారణకాండతో సహా ఎన్నో జరిగిపోయాయి కానీ పాలకులు ఎవరిపైనైనా ఏదైనా చర్య చూశామా?

> రాజ్యాంగాన్ని భారత ప్రజలమైన మేము మాకు ఇచ్చుకుంటున్నాము అని పేర్కొంటున్నాం. అంటే వ్యవస్థలో జరిగిన దానికి, చేసిన దానికి ఎవరో ఒకరు అందరికీ జవాబుదారీగా వుండాలి. సభల్లో బలాన్ని బట్టి ప్రధాని, ముఖ్యమంత్రి నియామకం జరిగాక మంత్రివర్గం దాని తరపున నాయకులుగా వున్న ప్రధాని లేదా ముఖ్యమంత్రి సభకు బాధ్యత వహించాలి. అంతర్గతంగా ఆ యా శాఖలు లేదా విభాగాలు చూసేవారు ముఖ్యమంత్రికి, ప్రధానికి, ప్రభుత్వాలకు బాధ్యత వహించాలి. ఇది విస్తృతమైన విభజన. కానీ రాజధానుల నుంచి ప్రాజెక్టుల వరకూ దేశమంతటా కొనుగోళ్ల నుంచి నిధుల వరకూ ఎన్ని తప్పులు జరిగినా ఎన్ని కేసులు నడిచినా పూర్తి బాధ్యత ఎవరిదనేది తేల్చడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా అస్మదీయులు తస్మదీయులనే ప్రాతిపదికన వెళ్లడం కోర్టులలోనూ రకరకాల తీర్పులు రావడం జరిగిపోతుంది. అదానీ విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం, పోలవరం, అమరావతి, బీహార్‌లో, గుజరాత్‌లో బ్రిడ్జిలు పతనం ఎన్ని సంచలనాత్మక తప్పిదాల్లో బాధ్యత తేల్చారా? గుజరాత్ మారణకాండతో సహా ఎన్నో జరిగిపోయాయి కానీ పాలకులు ఎవరిపైనైనా ఏదైనా చర్య చూశామా?

ఇప్పుడు ఒక అధికార పార్టీ లేదా కూటమి సభలో విశ్వాసం కోల్పోతే కాదంటే బలాబలాలు మారితే దిగిపోవలసి వుంటుంది. మరెవరూ ముందుకు రాకపోతే సభ రద్దయిపోతుంది. కానీ జమిలి బిల్లు వస్తే ఇదీ వుండదు. కేంద్రం, రాష్ట్రం, గవర్నర్, రాష్ట్రపతి మధ్య ఏ ప్రభుత్వం ఏ సభ రద్దవుతుందో కొనసాగుతుందో తెలియని స్థితి. ఎందుకంటే ప్రభుత్వం పడిపోయినా వెంటనే ఎన్నికలు జరపాల్సిన పనిలేదు. కొత్తగా వచ్చే ప్రభుత్వం మిగిలిన కాలానికి మాత్రమే పనిచేస్తుంది (ఉప ఎన్నికలలో మిగిలిన కాలమే వున్నట్టు). అంటే జవాబుదారీతనం ఎటు పోతుంది? కొత్తగా ఎన్నికైన వారి పదవీ కాలం తగ్గించడం అంటే ఎవరి తప్పుకు ఎవరిని శిక్షిస్తున్నట్టు? నోట్ల రద్దు వంటి నిర్ణయాలు, భారీ కుంభకోణాలు, లక్షల కోట్ల ఎగవేతలు, ప్రజల ఆస్తులు కట్టబెట్టడాలు-వీటికి పాలకుల బాధ్యత ఏమైపోతున్నట్టు? సార్వభౌమత్వాన్ని కాపాడవలసిన కేంద్ర పాలకులు అమెరికా వంటి దేశాల వత్తిడికి లోబడిపోతే పార్లమెంటుకు కూడా జవాబుదారీతనం ఎక్కడ మిగిలేట్టు? తమ రాజకీయ అవసరాల కోసం దుస్సాహస నిర్ణయాలు తీసుకుంటే ఎక్కడ చర్చ జరిగేట్టు? అలాగే అధికారాన్ని నిరంకుశంగా వినియోగించి ప్రజల హక్కులు హరిస్తే ఎక్కడ విచారించేట్టు? ఇవన్నీ 75 ఏళ్ల అనుభవం ముందుకు తెస్తున్న కీలక సవాళ్లు. వాటికి జవాబులు వెతకాల్సింది పోయి వున్న హక్కులను కూడా తొలగించడం వ్యవస్థలను తలకిందులు చేసి వ్యక్తుల పెత్తనాలు రుద్దడం అనుమతించరానిది. ట్రంప్ ప్రమాణ స్వీకారంలో ఎలన్ మస్క్ చక్రం తిప్పినట్టే ఇక్కడ పాలకుల నీడన అదానీలు, అంబానీలు, ఇంకా రాష్ట్రాల కుబేరులు ధనాన్ని మతాన్ని జోడించి స్వారీ చేస్తుంటే ఇక జవాబుదారీతనం, రాజ్యాంగ విలువలు ఎటుపోయేట్లు?

ఆగష్టు 15న జండా ఎగరేస్తారు. అంటే ఒక ఎత్తుకు చేరుస్తారు. జనవరి 26న పైన కట్టి వున్న జెండా ఆవిష్కరిస్తారు. అంటే స్వేచ్ఛగా ఎగిరేలా చేస్తారు. తెచ్చుకున్న స్వాతంత్ర్యాన్ని సరిగ్గా కాపాడుకోవడమే ఇందులో సందేశం.

★

సెటైర్

ట్రంప్ ట్రంపస్య ట్రంపోభ్య...

ట్రంపు భలే ఇంపు అన్నాడొక మిత్రుడు. వెంటనే, కాదు కాదు ట్రంపు ఓ కంపు అన్నది ఓ స్నేహితురాలు. కానే కాదు ట్రంపు మాట వినసొంపు అన్నాడో పెద్దమనిషి.. లేదు లేదు ట్రంపు ఏమంత ఇంపైన పదం కాదని మరో పండితురాలు అన్నది. ఈ డైలాగులన్నీ పక్కనే ఉన్నా మాట్లాడుకునేవాళ్లకు తెలియకుండా వింటోంది పిపీలికం అనే మోడ్రన్ చీమ. సహజంగానే దానికి ఎన్నో అనుమానాలొచ్చాయి. రావిశాస్త్రి గారి కథలోలాగ తానూ బయలుదేరి మాంచి తెలివిగలవారిని కలిసి ఇంతకీ ఈ ట్రంపు నిజంగా ఇంపు, కంపు, సొంపునా లేక ఇవేవీ కాని మరో మనిషా అని తెలుసుకోడానికి అక్కడినుండి జనంపై, ప్రపంచంపై పడింది చీమ.

మొదట దువ్వాడ జగన్నాథం సినిమా డైలాగులు రాసినతని దగ్గరికి పోయింది పిపీలికం. ఆయన వెంటనే తన డైలాగు ట్రంప్ ట్రంపస్య ట్రంపోభ్య....అన్నాడు. ఈ పదాలకు అర్థమేమిటన్నది పిపీలికం. నేను బిజీగా ఉన్నాను మళ్లీ రమ్మన్నాడాయన. డ్రీం రియలిజంలో లాగ కలనో, నిజమో తెలియకుండానే చీమ తనకిష్టమైన వాళ్ల దగ్గరికి అలవోకగా పోతోంది. అలా ఇంగ్లీషు రచయిత, నాటకకర్త షేక్స్పియర్ దగ్గరికి పోయింది. ట్రంప్ గురించి అడిగింది, మీకేమైనా తెలిస్తే చెప్పమంది. ఆయనొక్కటే మాట చెప్పాడు. ట్రంప్ మిత్రులెవరో చెప్పు. నేను ట్రంపు గురించి చెబుతాను అన్నాడు. ఆయన ప్రమాణ స్వీకారానికి హాజరై వచ్చిన వాళ్లెవరో ముందు కనుక్కో అన్నాడు. చీమ వెంటనే 'ట్రంప్ మిత్రులెవరబ్బా...' అనుకుంటూ బయలుదేరింది. ఆయన మిత్రుల్ని వరుసగా కలుస్తోంది. ఒక మిత్రుడేమో ట్రంపంటే అమెరికా ప్రెసిడెంటు అంటే ప్రపంచంలో బాగా ప్రాచుర్యమున్న, బలవంతుడైన వ్యక్తి అన్నాడు.

ప్రపంచంలో బలవంతుడైన వ్యక్తి ఎలాగవుతాడు? ఒక్క బాక్సింగు క్రీడాకారిణిని లేదా క్రీడాకారుణ్ణి కొట్టగలడా అని ఆరా తీసింది. కొట్టలేడని చెప్పారు చాలామంది. మరి ప్రపంచంలో అందరికంటే ఎలా బలవంతుడవుతాడు అమెరికా ప్రెసిడెంటు. అది ట్రంపు కావచ్చు ఇంకెవరైనా కావచ్చు అనేసరికి అసలు అమెరికా అధ్యక్షుడంటే ప్రపంచ పోలీసు నీకేం తెలుసు? అని ఇంకొకరన్నారు. మరి మామూలు సూటు బూటు వేసుకున్నాడు కదా పోలీసెలా అవుతాడు? వాళ్ల యూనిఫాం కూడా వేసుకోలేదు కదా అంది పిపీలికం. ఓసి పిచ్చి పిపీలికమా అదంతే! ప్రపంచ పోలీసు అలాగే ఉంటాడు మరి. చేతిలో లాఠీ పెట్టుకొని ఉంటాడా ఏమన్నా? అవసరమొచ్చినప్పుడు తన లాఠీ లాంటి ఆధిపత్యం చూపిస్తాడు అదే అందులో ఉన్న తమాషా అన్నారింకొకరు.

అసలు ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో కాదు నేను సీదా అమెరికాకే పోయి ట్రంపు ఆఫీసులో ఏమేమి జరుగుతాయో చూసిరావడం మేలు అనుకొని పిపీలికం రాజీవ్ గాంధీ ఎయిర్‌పోర్టుకు బయలుదేరింది. ఎటువంటి పాస్‌పోర్టు, వీసా కనీసం టికెట్టు కూడా లేకుండానే విమానమెక్కేసింది. విమానంలో పోతున్న భారతీయులు అక్కడ పౌరసత్వం ఉన్నోళ్లు, ఇప్పుడు తీసుకుందామని ప్రయత్నాలు చేస్తున్నవాళ్లు మాట్లాడుకునే మాటలు మన పిపీలికం చెవిలో పడ్డాయి. తన దేశ పౌరుల క్షేమమే తనకు ముఖ్యం అని ట్రంప్ మాటలున్న వీడియో చూస్తున్నాడు ఒక యువకుడు. పక్కనే ఇంకో యువతి, ఇద్దరూ భార్యాభర్తలు అక్కడ ఒకరికి ఉద్యోగముంది ఇంకొకరికి ప్రయత్నం చేద్దామని పోతున్నారు. తెలుగులో మాట్లాడుతుండడం విని పిపీలికానికి ఆశ్చర్యమేసింది. అరే వీళ్ళు తెలుగోళ్ళు కదా ఇంగ్లీషులో కదా మాట్లాడాల్సింది అనుకుంది కూడా. పక్కనోళ్లకు తెలియకుండా అలా తెలుగులో మాట్లాడుతున్నారని తరువాత అర్థమయింది. ఇప్పుడు ట్రంపు చేస్తున్న పనులకు, మాట్లాడుతున్న మాటలకు ఎక్కువగా భయపడుతున్నది భారతీయులే అని అర్థమయింది. ఇంతలో వాషింగ్టన్ వచ్చిందని అందరూ దిగిపోతున్నారు.

మెల్లగా అందరూ దిగిపోయినాక తానూ దిగింది. తననెవరైనా చూస్తున్నారేమోనని మొదట అనుమానపడింది. ఎవరి పనుల్లో వాళ్లున్నారు. అక్కడి చీమలు కూడా తనని చూసినట్టు అనిపించింది కాని అవి పెద్దగా పట్టించుకోలేదు. ట్రంప్ పాలనలో తమకేమైనా మేలు జరుగుతుందని అనుకుంటున్నారా అని వాటిని అడిగింది పిపీలికం వచ్చీరాని ఇంగ్లీషులో. ఎవరొస్తే ఏమన్నట్టు మాట్లాడాయి అవి కూడా. సరేననుకుని మెల్లగా ప్రెసిడెంటు ఉండే శ్వేతసౌధం వైపు పోయింది. అక్కడ చీమలతో ఇంటర్వ్యూ చేసి కొన్ని వివరాలు రాబట్టింది. విలేకరులతో ట్రంప్ ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టి అది. అందరికీ వాళ్ళ టిఫిన్లు ఇచ్చారు. వాళ్లు తినేలోపు వైట్‌హౌస్ వంటశాలలో తనకు నచ్చినవి తినొచ్చింది పిపీలికం. విలేకరులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలిస్తున్నాడు ట్రంప్. ఈ దేశంలో పుట్టినంత మాత్రాన ఇక్కడి పౌరసత్వం రాదని కరాఖండిగా చెబుతున్నాడు. అలా చేస్తే మన దేశానికి నష్టం కదా అన్న ఒక ప్రశ్నకు ముందు నాదేశ పౌరుల్ని కాపాడుకోవడం నా విధి అంటున్నాడు. ఫలానా తేదీ తరువాత పుట్టేటోళ్లకు పౌరసత్వం రాదంటున్నాడు. మొదట సరైన పత్రాల్లేని ఐదు వందల విదేశీ పౌరుల్ని వాళ్ల వాళ్ల దేశాలకు పంపేశానన్నాడు. ఇలా చేస్తే వాళ్లు చేసే పనులు అంత తక్కువ జీతాలకు ఇతరులు చేయరు కదా అని ఒక విలేకరి అడిగాడు. నువ్వు బైడెన్ మనిషివా? అన్నాడు ట్రంపు. ఆ నోటి కంపు భరించలేక ఊరుకున్నాడు ఆ విలేకరి. దానికీ మార్గం చూపుతానన్నాడు. ఆ సమావేశం తరువాత పెద్ద పెద్ద కంపెనీల సీయీవోలతో సమావేశమయ్యాడు అధ్యక్షుడు. అక్కడికీ పోయింది మన పిపీలికం. అక్కడ వాళ్లు నిర్దేశించినవి తన సహాయకుడు అన్నీ రాసుకుంటున్నాడు. త్వరలో ఇవన్నీ చేస్తానని చెబుతున్నాడు వాళ్లకి. అమెరికాలో కొన్ని రాష్ట్రాలకు కూడా పోయింది పిపీలికం. అన్ని దేశాల వాళ్ల ఇళ్లకూ పిలవని పేరంటంలా పోయి అక్కడక్కడ కొన్ని విషయాలు కనుక్కుంది. అయినా తృప్తి కలుగలేదు దానికి.



●●●

ఓ రోజు ట్యాంక్‌బండ్ దగ్గర ఓ పెద్దాయన కూచొని ఉన్నాడు. ఆయన్నడిగితే ఏమైనా తెలుస్తుందేమోనని మెల్లగా కదిలించింది. నువ్వు రావి శాస్త్రి పిపీలికానివా అన్నాడాయన. నేను కొత్త తరం పిపీలికాన్ని. ఐనా నాకూ కొన్ని అనుమానాలున్నాయి అని అమెరికా అధ్యక్షుడి గురించిన విషయం అడిగింది. చూడూ సీదా ఉస్మానియా యూనివర్సిటీకి పో. అక్కడ అపర్ణ అనే విద్యార్థిని అమెరికా అధ్యక్షులపై పరిశోధన చేస్తోంది. ఆమె తీరుస్తుంది నీ అనుమానాలు అన్నాడు. సరేనని ఆమెను కలిసింది. తనకున్న అనుమానాలన్నీ అడిగింది. ఇంతలేవు నీవు అనుకోకుండా పిపీలికం గారూ అని మొదలు పెట్టింది అపర్ణ.

"సూటు బూట్లు, మంచి తిండి, వైట్‌హౌస్ నివాసం, మంచి గుర్తింపు, ప్రథమ పౌరుడు భార్యకు ప్రథమ పౌరురాలు, చార్టరు విమానాలు, మంచి కార్లు ఇలా అన్నీ ఉంటాయి అధ్యక్షుల వారికి. ఏ అధ్యక్షుడైనా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా రీగన్ కాదు, ఒబామా కాదు ఇంకెవరైనా తమ దేశంలో ఉన్న పెట్టుబడిదారులే ఆ దేశాన్ని, తద్వారా ప్రపంచాన్ని కంట్రోలు చేసేది. అంతెందుకు ఏయే అధ్యక్షుడు ఉండంగా ఏయే యుద్ధాలు చేశాడు, చేయించాడు లేకుంటే ఆయుధాలందించాడు? ఒక్క అధ్యక్షుడైనా ఒక యుద్ధాన్ని ఆపాడా? ఇప్పుడు జరుగుతున్న హమాస్-ఇజ్రాయిల్ యుద్ధమే తీసుకో అధ్యక్షుడు ఏవైపున్నాడు. ఇప్పుడు కొత్త ప్రెసిడెంటు వచ్చాడు కదా. అంతకు ముందాయన మొదలుపెట్టిన వాటిని ఆపుతాడా? కాబట్టి పిపీలికం గారూ, తోలుబొమ్మలాట చూశారా అలాగే ఈ అధ్యక్షుడి ఆట ఆడించేది వేరేవారు. వాళ్లే ధనిక కార్పొరేట్లు. ముందు అది తెలుసుకోండి...' అంది.

పిపీలికానికి మనసు తేలికపడిందిప్పుడు. హాయిగా తన చిన్ని చిన్ని ఊపిరితిత్తులతో గాలి పీల్చుకుంది. అమెరికా అధ్యక్షుడంటే ప్రపంచం మీద పెత్తనం చేసేవాడు అనుకుంటూ ఇంటికి పోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురు చూస్తుంటారు వాళ్లకు విషయాలు చెప్పాలని కూడా అనుకుంది.

- జంధ్యాల రఘుబాబు,
సెల్ : 9849753298

ఉసూరుమనిపించిన ఉలవ..!

- వర్షాభావంతో దిగుబడిపై ప్రభావం

ప్రజాశక్తి-కదిరి టౌన్ (సత్యసాయి జిల్లా)

వరుస కరువుల నేపథ్యంలో జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాగును రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. ఇదే సమయంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. కదిరి నియోజకవర్గం రైతులు అంతర పంటలుగా చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగానే ఎక్కువ మంది ఉలువ పంట సాగు చేశారు. మొదటగా ఉలవ పంట బాగా ఏపుగా పెరిగింది. దీంతో పంట దిగుబడి బాగా వస్తుందని రైతులు భావించారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో వర్షాభావం నెలకొనడంతో దిగుబడిపై ప్రభావం పడింది. దీంతో కనీసం పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది.

సగం పెట్టుబడి కూడా రాని వైనం..!

నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన రైతు నరసింహులు ఆరు ఎకరాల్లో ఉలవ పంట సాగు చేశారు. పంట సాగునిమిత్తం రూ.65 వేల వరకు ఖర్చు చేశారు. ప్రయివేటు వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పు తెచ్చి పంట సాగు చేశారు. దిగుబడి సరిగా లేకపోవడంతో పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. ఉలవలు నాణ్యత లేక, గింజలు తాలుగా ఉండడంతో కొనేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రస్తుతం పంట నూర్పిడి అనంతరం అమ్మడానికి వెళ్తే క్వింటా రూ.మూడు వేలకు మించి వ్యాపారులు అడగడం లేదు. సాగుకు రూ.65 వేలు ఖర్చు చేస్తే కనీసం రూ.30 వేలకు మించి రాని పరిస్థితి కన్పిస్తోంది. ఈ ఏడాది ఉలవ పంట సాగు చేసిన రైతులందరిదీ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. చాలా మంది రైతులు పంటను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

ప్రభుత్వంపై ఆశలు

ఉలవ సాగు చేసి పెట్టుబడులు కూడా చేతికందకపోవడంతో రైతులు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుకు పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదు. దీంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట చేతికందక పోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పంట సాగు సమయంలో సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ అధికారులు ఉలవ రైతుల గురించి పట్టించుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో టిడిపి కూటమి ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని, పంటనష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో రానున్న ఐదేళ్లల్లో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శనివారం పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్, బిఆర్ఆర్ అండ్‌జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలో మంత్రి రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతీ, యువకులకు నియామకపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. తక్కువ ఫీజులతో సేవాతత్వంతో కార్పొరేటుకు దీటుగా నాణ్యమైన విద్యనందిస్తున్న ఛాంబర్స్ కాలేజీ పాలకవర్గాన్ని, అధ్యాపకులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయి సాంకేతికతను, పరిశ్రమలను, పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి తీసుకొచ్చి యువతకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే అవసరం లేకుండా చదువుకున్న కళాశాలల్లోనే జాబ్ మేళాలు నిర్వహించి పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా టిడిపి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

విష్ణు కెమికల్‌లో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పరవాడ, విశాఖ కలెక్టరేట్

అనకాపల్లి జిల్లా పరవాడ రాంకీ ఫార్మా సిటీలో విష్ణు కెమికల్ పరిశ్రమలో శనివారం కన్వేయర్ బెల్టులో పడి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు రాజ్ వీర్ (20) మృతిచెందాడు. ఆయన మృతిపై సమగ్ర విచారణ చేయాలని ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కెజిహెచ్ మార్చురీ వద్ద రాజ్‌వీర్ మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబీకులను పరామర్శించారు. పరిశ్రమల్లో వరుస ప్రమాదాలతో కార్మికులు భయాం దోళనకు గురవుతున్నారని తెలిపారు. ఫార్మా కంపెనీల్లో భద్రతా చర్యలు మృగ్యంగా మారాయన్నారు. మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించాలి

- అభివృద్ధి ముసుగులో వనరులను దోచుకునే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి
- 'ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు'పై సదస్సులో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి రూ.50 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అధ్యక్షతన 'ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వనరులను దోచుకునే అభివృద్ధి తమకు వద్దన్నారు. మానవాభివృద్ధి కోసం సిపిఎం ప్రత్యామ్నాయ విధానంతో పోరాడుతోందన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకూ నెల్లూరులో సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ విధానాలను తెలియజేయడానికి విజయవాడ, కర్నూలు, విశాఖల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎపి అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదని, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు, వికేంద్రీకరణ జరగాల్సి ఉందని పేర్కొన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో విధ్వంస పాలన జరిగిందని చంద్రబాబు చెబుతున్నారని, అది నిజమేనని అన్నారు. అయితే, టిడిపి కూటమి పాలనలోనూ రాష్ట్రంలో మహా విధ్వంసం జరగబోతోందని తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ పేరుతో ఉత్తరాంధ్రలో మౌలిక వసతులు కల్పించే పేరుతో ప్రజల అవసరం కోసం కాకుండా ఇక్కడ అటవీ, ఖనిజ, సముద్ర సంపదలను కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రణాళిక సిద్ధమైందన్నారు. చంద్రబాబు విజన్-2047లో కార్మిక సమస్యలపై ప్రస్తావన లేదని, అసలు మనుషుల శ్రమనే గుర్తించలేదని తెలిపారు. వ్యాపారులకు ఎంత వేగంగా దగ్గరవ్వాలనే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే అందులో ఉందన్నారు. ప్రజల ఆదాయాలు పెంచి కొనుగోలు శక్తిని పెంచడం లేదని దేశ వ్యాప్తంగా పలు నివేదికలు చెప్పాయన్నారు. మానవాభివృద్ధి నివేదికలను చూస్తే దేశంలో నెంబర్ వన్ స్థానంలో కేరళ ఉందని, గుజరాత్ ఎక్కడో 14వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 9వ స్థానంలో ఉన్నాయన్నారు. సంపదలు పెరుగుతున్నా ప్రజలకు చేరడం లేదని తెలిపారు. గడిచిన 35 ఏళ్ల సంస్కరణలు తీవ్రమైన అసమానతలు పెంచాయన్నారు. విశాఖ ఆర్థిక రాజధాని అని చెప్పిన చంద్రబాబు... దావోస్ ఐదు రోజుల పర్యటనలో ఒక్క ఐటి కంపెనీనైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర 69, తెలంగాణ 41 ఎంఒయులు చేసుకున్నాయని గుర్తు చేశారు. చంద్రబాబు చెప్పే పి-4 విధానంతో సహజ వనరులైన సూర్యరశ్మి, గాలి, వెలుతురు, భూమి, నీరు, రైతుల పొలాలను తీసుకుని సోలార్ విద్యుత్, గ్రీన్‌ఎనర్జీ తయారు చేసి ప్రజలకే అమ్మేస్తారని వివరించారు.

అభివృద్ధిని కోరుకునేది కమ్యూనిస్టులే..

అభివృద్ధికి కమ్యూనిస్టులు వ్యతిరేకం అనే ప్రచారంతో పాలకులు తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని, వాస్తవానికి ప్రజలు, పారిశ్రామికవేత్తల అభివృద్ధిని కోరుకునేది కమ్యూనిస్టులేనని వి.శ్రీనివాసరావు అన్నారు. 2047 విజన్‌లో ప్రజా సంపదలపై ఆధిపత్యం చేసేందుకు ఉద్యోగాలను ఎరగా వేసే విధానం దాగి ఉందని తెలిపారు. గడిచిన పదేళ్లలో 25 లక్షల సాగు భూములను సెజ్‌ల పేర లాక్కొన్నారని, వీటిని బ్యాంకుల్లో కుదవ పెట్టి రూ.వేల కోట్లు రుణాలు తీసుకుని పరిశ్రమలు పెట్టకుండానే బోర్డులు తిరగేసేశారని తెలిపారు. నాలెడ్జ్ హబ్ కోసం 4,600 ఎకరాలను ఇలానే కొట్టేశారన్నారు. వీటన్నిటిపైనా పోరాడుతున్నది సిపిఎం, కమ్యూనిస్టులేనని తెలిపారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి చేయండి : రిటైర్డ్ చీఫ్ ఇంజినీరు నారాయణరాజు

సదస్సులో రిటైర్డ్ చీఫ్ ఇంజినీరు (ఇరిగేషన్) నారాయణరాజు మాట్లాడుతూ పోలవరం పూర్తి చేశాక రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి రాయలసీమకు నీటిని మళ్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం మంచిదే అయినా.. 50 ఏళ్లుగా ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు తగిన నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. రూ.500 కోట్లు కేటాయిస్తే ఉత్తరాంధ్రలో 25 లక్షల ఎకరాలు సస్యశ్యామలమవు తాయన్నారు. చిన్న నీటి ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు అవగాహనలేని ప్రకటనలు చేసి గందరగోళం సృష్టిస్తున్నారని, ప్రాజెక్టు అంశాన్ని రాజకీయంగా వాడుకోవడం తగదని అన్నారు. 78 శాతం పనులు పూర్తయిపోయాయని ముఖ్యమంత్రి స్వయంగా అసెంబ్లీలో ప్రకటన చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. తొలి ప్రాధాన్యతగా అక్కడి నిర్వాసితులకు న్యాయం జరగాల్సి ఉందని తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం అభివృద్ధని, వారికేం కావాలో ఎంచుకునే స్వేచ్ఛ అభివృద్ధి అని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులకు శ్రద్ధ, బాధ్యత కొరవడ్డాయన్నారు. 25 లక్షల ఎకరాలకు సాగు నీరందాల్సి ఉందని, ఏటా 1,100 మిల్లీమీటర్ల వర్షపాతం ఈ ప్రాంతంలో ఉన్నా 75 ఏళ్లుగా కేవలం ఏడు లక్షల ఎకరాలకే నీరందడం దారుణమని తెలిపారు. సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.సురేంద్ర, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, ఎం.కృష్ణమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

'పద్మ' అవార్డులు వీరికే

న్యూఢిల్లీ : వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి కేంద్ర ప్రభుత్వం 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. పద్మవిభూషణ్, పద్మభూషణ్ లభించిన వారి వివరాలిలా ఉన్నాయి.

పద్మ విభూషణ్ వీరికే

దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి (వైద్యం) – తెలంగాణ
జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేహర్ (రిటైర్డ్) (ప్రజా వ్యవహారాలు) – చండీగఢ్
కుముదిని రజినీకాంత్ లాఖియా (కళలు) – గుజరాత్
లక్ష్మీనారాయణ సుబ్రమణియం (కళలు) – కర్ణాటక
ఎం.టి.వాసుదేవన్ నాయర్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) – కేరళ
ఒసాము సుజుకీ (మరణానంతరం) (వాణిజ్యం, పరిశ్రమలు) – జపాన్
శారదా సిన్హా (మరణానంతరం) (కళలు) – బిహార్

పద్మభూషణ్ వీరికే..

నందమూరి బాలకృష్ణ (కళలు) – ఆంధ్రప్రదేశ్
ఎ.సూర్యప్రకాశ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) – కర్ణాటక
అనంత్ నాగ్ (కళలు) – కర్ణాటక
బిబేక్ దెబ్రాయ్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) – ఎన్‌సీటీ ఢిల్లీ
జతిన్ గోస్వామి (కళలు) – అస్సాం
జోస్ చాకో పెరియప్పురం (వైద్యం) – కేరళ
కైలాశ్ నాథ్ దీక్షిత్ (ఇతర– ఆర్కియాలజీ) – ఎన్‌సీటీ ఢిల్లీ
మనోహర్ జోషీ (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) – మహారాష్ట్ర
నల్లి కుప్పుస్వామి చెట్టి (వాణిజ్యం, పరిశ్రమలు) – తమిళనాడు
పీఆర్ శ్రీజేశ్ (క్రీడలు) – కేరళ
పంకజ్ పటేల్ (వాణిజ్యం, పరిశ్రమలు) – గుజరాత్
పంకజ్ ఉదాస్ (మరణానంతరం) (కళలు) – మహారాష్ట్ర
రామ్‌బహదూర్ రాయ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) – ఉత్తర్‌ప్రదేశ్
సాధ్వీ రితంభరా (సామాజిక సేవ) – ఉత్తర్‌ప్రదేశ్
ఎస్.అజిత్ కుమార్ (కళలు) – తమిళనాడు
శేఖర్ కపూర్ (కళలు) – మహారాష్ట్ర
శోభన చంద్రకుమార్ (కళలు) – తమిళనాడు
సుశీల్ కుమార్ మోదీ (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) – బిహార్
వినోద్ ధామ్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్) – అమెరికా



ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహంలో పరిస్థితులను తెలుసుకుంటున్న హోం మంత్రి అనిత

బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహ సందర్శనలో హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖ)

రాష్ట్రంలో బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖ వ్యాలీ స్కూలు వద్ద ఉన్న ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహాన్ని ఆమె శనివారం ఉదయం సందర్శించారు. మూడు రోజులుగా అక్కడ జరుగుతున్న పరిణామాల దృష్ట్యా హోం మంత్రి పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. తొలుత ఆమె గృహాన్ని సందర్శించి అక్కడ నెలకొన్న పరిస్థితులను తెలుసుకున్నారు. బాలికలతో మాట్లాడారు. మూడు రోజులపాటు తమను ఇంటికి పంపించేయాలని బాలికలు చేసిన ఆందోళనను, అందుకు దారితీసిన పరిస్థితులను గృహ పర్యవేక్షణాధికారి సునీతను, సిబ్బందిని, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాలికల ఆందోళన విషయం తెలియగానే జిల్లా కలెక్టర్, తహశీల్దారు, పోలీసు అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకొని పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించినట్టు తెలిపారు. బాలికల సమస్యను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలే తప్ప రాజకీయం చేసి కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి మాట్లాడటం వైసిపికి తగదన్నారు. ఇక్కడ జరిగినది చాలా సున్నితమైన విషయమన్నారు. ఇక్కడ ఉంటున్న బాలికలు వేర్వేరు ప్రాంతాల నుంచి, వేర్వేరు సమస్యలు, వారి వారి కుటుంబ నేపథ్యాలు బాగాలేక వచ్చినవారే నన్నారు. వారిలో కొంతమంది లైంగిక దాడులకు గురై డిప్రెషన్‌లో ఉంటారన్నారు. వారి సమస్యను గుర్తించి వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు కొంత మందిని ఇంటికి పంపించామని, మరి కొంతమందిని వేరే హోంకు తరలించామని అన్నారు. మరొక బాలిక విషయం కోర్టు పరిధిలో ఉండటం వల్ల వెంటనే పంపలేకపోతున్నామని తెలిపారు. ఈ విషయంపై వైసిపి రాజకీయం చేసి లబ్ధిపొందాలనుకోవడం మానుకోవాలని హితవు పలికారు. బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. ఈ విషయం ఎవరూ గుర్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పుడు సమస్య పరిష్కారమైందని, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకూడదనే గృహాన్ని సందర్శించానని తెలిపారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే అత్యుత్తమ ప్రతిభ

- గణతంత్ర దినోత్సవ సందేశంలో జిఎం పరమేశ్వర్ పంక్వాల్

ప్రజాశక్తి - విశాఖపట్నం : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్ తన గణతంత్ర దినోత్సవ సందేశాన్ని శనివారం మీడియాకు విడుదల చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే గడిచిన ఏడాది కాలంగా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ వచ్చిందన్నారు. ఎన్నడూ లేని విధంగా అన్ని జోన్లను వెనక్కి నెట్టి 200 మెట్రిక్ టన్నుల లోడింగ్ మైలురాయిని అధిగమించిందని తెలిపారు. 2024 డిసెంబర్ నాటికి రూ.17,324 కోట్ల ఆదాయం ఆర్జించిందని, అదేవిధంగా 6.9 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిందని పేర్కొన్నారు. రూ.1745 కోట్ల ఆదాయం ప్రయాణికుల రవాణా ద్వారానే సాధించినట్టు తెలిపారు. 12 కుంభమేళా ప్రత్యేక రైళ్లతో పాటు 1718 ప్రత్యేక రైళ్లను ఈ కాలంలో నడిపామన్నారు. సాధారణ రైళ్లకు 4545 అదనపు కోచ్‌లను జోడించామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 276 కిలోమీటర్ల కొత్త రైలు మార్గం, డబులింగ్, మల్టీ ట్రాకింగ్ పనులు పూర్తయ్యాయన్నారు.

నెల రోజుల్లో పంప్డు స్టోరేజ్ ప్రాజెక్టు పనులు ప్రారంభం

ఎపి జెన్కో హైడల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్

ప్రజాశక్తి-సీలేరు (అల్లూరి జిల్లా)

జికె.వీధి మండలం సీలేరు పార్వతీనగర్ వద్ద 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణ పనులు నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయని ఏపీ జెన్కో హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్ వెల్లడించారు. హైడల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా సీలేరు కాంప్లెక్స్‌లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఏపీ జెన్కో అతిథి గృహంలో జెన్కో అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంపు స్టోరేజ్ నిర్మాణానికి కావలసిన అనుమతులన్నీ మంజూరయ్యాయని, ఇంకా అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉందని చెప్పారు. అవి రాగానే టెండర్లు దక్కించుకున్న మెఘా ఇంజనీరింగ్ కంపెనీ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఎన్‌హెచ్‌పి భాగస్వామ్యంతో ఏపీ జెన్కో అనేక చోట్ల కొత్త ప్రాజెక్టులు చేపడుతుందని చెప్పారు. 5070 మెగావాట్లు సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మించడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ముందే 2027 ఫిబ్రవరి నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మొదటి దశలో రెండు యూనిట్లు 2026 నాటికి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

ఎయును సందర్శించిన సియోరాలియోన్ అంబాసిడర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : సియెరా లియోన్ దేశ అంబాసిడర్ (యుఎఇ) రషీద్ సిసే ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శనివారం సందర్శించారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న సియెరా లియోన్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చక్కటి వాతావరణం ఉందన్నారు. ఇక్కడ చదువుతున్న తమ దేశ విద్యార్థులు ఉత్తమ విలువలు నేర్చుకుంటున్నారని తెలిపారు.

ప్రపంచాన్నే మార్చగలిగే శక్తిమంతులు బాలికలు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ప్రజాశక్తి - పార్వతీపురం

బాలికల హక్కులను పరిరక్షిస్తూ, వారి అవసరాలను తీర్చగలిగితే సమాజంతో పాటు, ప్రపంచాన్ని మార్చగలిగే శక్తివంతులు బాలికలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభిప్రాయపడ్డారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆడ బిడ్డ అంటే భారం కాదని బలమైన, ధైర్యవంతులైనవారని అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కోసం, బాలికల సాధికారతకు ప్రతి ఆడపిల్లను చదివించి, వారిని సంరక్షించాలన్నదే బేటీ బచావో - బేటీ పడావో లక్ష్యమన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1444వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి కార్మికులు చేస్తున్న పోరాటం తప్పక విజయం సాధిస్తుందన్నారు. ఉద్యమాల ఫలితంగానే స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఇటీవల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిందని తెలిపారు. కర్మాగారానికి సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేస్తే కచ్చితంగా ప్లాంట్ లాభాల బాట పడుతుందన్నారు.

పిల్లనివ్వలేదని కక్షగట్టి హత్య

ప్రజాశక్తి-నెల్లూరు

పిల్లనివ్వలేదని కక్షగట్టి ఆమె తండ్రిని హతమార్చిన ఘటన నెల్లూరులో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని నవాబుపేటకు చెందిన రోటీ మాబాషా (52) తన రెండవ కుమార్తెను సయ్యద్‌కు ఇచ్చి పెళ్లి చేయాలని అనుకున్నారు. అయితే సయ్యద్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో పెళ్లికి మాబాషా నిరాకరించారు. దీంతో మాబాషాను హతమార్చాలని పన్నాగం పన్నాడు. ఈ క్రమంలో నవాబుపేట పరిధిలోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో మాబాషాపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మాబాషా మరణించారు. దాడి అనంతరం నిందితుడు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రచ్చుమర్రిలో భారీ చోరీ

- 70 తులాల బంగారం, కిలో వెండి, రూ.3.5 లక్షల నగదు దొంగతనం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో భారీ చోరీ జరిగింది. 70 తులాల బంగారం, కిలో వెండి, రూ.3.5 లక్షల నగదు చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు... గ్రామంలోని మురారి శేషాద్రిశెట్టి కుటుంబం వారం రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లింది. శుక్రవారం రాత్రి తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోని 70 తులాల బంగారం, కిలో వెండి, రూ.3.5 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు శనివారం మాధవరం పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విజయ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సత్తా చాటిన తెలుగు తేజం

- 72పరుగులతో రాణించిన హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ
- రెండో టి20లో ఇంగ్లండ్‌పై రెండు వికెట్ల తేడాతో గెలుపు


తిలక్ వర్మ (72నాటౌట్)

చెన్నై: ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టి20లో తెలుగు తేజం, హైదరాబాద్ కుర్రాడు తిలక్ వర్మ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. ఇంగ్లండ్ నిర్దేశించిన 166 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒకవైపు వికెట్లు వరుసగా పడుతున్నా.. చివరి వరకు క్రీజ్‌లో నిలిచి టీమిండియాను గెలిపించాడు. 18 ఓవర్లు ముగిసే సరికి 8 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. చివరి 12 బంతుల్లో 13 పరుగులు కావాల్సిన దశలో బిష్ణోయ్ వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. చివరి ఓవర్లో తిలక్ వర్మ తొలి రెండు బంతులకు 2, 4 కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. తిలక్ వర్మ(72నాటౌట్; 55బంతుల్లో 4ఫోర్లు, 5సిక్సర్లు), రవి బిష్ణోయ్(9నాటౌట్; 5బంతుల్లో 2ఫోర్లు) మ్యాచ్‌ను ముగించారు. సుందర్(26; 19బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) ఫర్వా లేదనిపించాడు. మిగతా బ్యాటర్లంతా నిరాశపరిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో కర్సెకు మూడు, ఆర్చర్, వుడ్, రషీద్, లివింగ్‌స్టోన్, ఓవర్టన్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో జోస్ బట్లర్(45) టాప్ స్కోరర్‌గా నిలవగా.. బ్రైడన్ కార్సే(31), జేమీ స్మిత్(22) రాణించారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తలా రెండు వికెట్లు సాధించగా.. అర్ష్‌దీప్, వాషింగ్టన్ సుందర్, అభిషేక్ తలా వికెట్ సాధించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తిలక్ వర్మకు లభించగా.. ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యతలో నిలిచింది. మూడో టి20 రాజ్‌కోట్ వేదికగా మంగళవారం జరగనుంది.

షమీకి మళ్లీ నో ఛాన్స్..

ఇంగ్లండ్‌తో రెండో టి20 మ్యాచ్ కూడా టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ షమీకి తుది జట్టులో చోటు దక్కలేదు. గాయం కారణంగా జట్టుకు దూరమై ఈ సిరీస్‌తోనే మళ్లీ జట్టులోకి వచ్చిన షమీకి తుది జట్టులో తప్పకుండా చోటు కల్పిస్తారని అంతా భావించారు. కానీ టీమిండియా మేనేజ్‌మెంట్ వరుసగా రెండో మ్యాచ్‌కు షమీని పెవిలియన్‌కే పరిమితం చేసింది. దాంతో చాన్నాళ్లకు షమీ బౌలింగ్ చూసే అవకాశం లభిస్తుందని ఆశపడ్డ అభిమానులకు అసంతృప్తే మిగిలింది.


స్కోర్‌బోర్డు...

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)సుందర్ (బి)అర్ష్‌దీప్ 4, డకెట్ (సి)జురెల్ (బి)సుందర్ 3, బట్లర్ (సి)తిలక్ (బి)అక్షర్ 45, బ్రూక్ (సి)వరుణ్ చక్రవర్తి 13, లివింగ్‌స్టోన్ (సి)హర్షిత్ (బి)అక్షర్ 13, స్మిత్ (సి)తిలక్ (బి)అభిషేక్ 22, ఓవర్టన్ (బి)వరుణ్ చక్రవర్తి 5, కర్సే (రనౌట్)జురెల్/బిష్ణోయ్ 31, ఆర్చర్ (నాటౌట్) 12, రషీద్ (సి)సంజు (బి)హార్దిక్ 10, వుడ్ (నాటౌట్) 5, అదనం 2. (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 165పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/26, 3/59, 4/77, 5/90, 6/104, 7/136, 8/137, 9/157. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-40-1, హార్దిక్ 2-0-6-1, సుందర్ 1-0-9-1, అక్షర్ 4-0-32-2, బిష్ణోయ్ 4-0-27-0, వరుణ్ 4-0-38-2, అభిషేక్ 1-0-12-1.

ఇండియా ఇన్నింగ్స్: సంజు (సి)కర్సే (బి)ఆర్చర్ 5, అభిషేక్ శర్మ (ఎల్‌బి)మార్క్ వుడ్ 12, తిలక్ వర్మ (నాటౌట్) 72, సూర్యకుమార్ (బి)కర్సే 12, ధృవ్ జురెల్ (సి)రెహాన్ (బి)కర్సె 4, హార్దిక్ (సి)సాల్ట్ (బి)ఓవర్టన్ 7, సుందర్ (బి)కర్సే 26, అక్షర్ (సి)డకెట్ (బి)లివింగ్‌స్టోన్ 2, అర్ష్‌దీప్ (సి)ఆర్చర్ (బి)రషీద్ 6, బిష్ణోయ్ (నాటౌట్) 9, అదనం 11. (19.2ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 166పరుగులు. **వికెట్ల పతనం:** 1/15, 2/19, 3/58, 4/66, 5/78, 6/116, 7/126, 8/146 **బౌలింగ్:** ఆర్చర్ 4-0-60-1, వుడ్ 3-0-28-1, కర్సే 4-0-29-3, రషీద్ 4-0-14-1, ఓవర్టన్ 2.2-0-20-1, లివింగ్‌స్టోన్ 2-0-14-1.

మాడిసన్ కీస్ సంచలనం

ఫైనల్లో టాప్‌సీడ్ సబలెంకను చిత్తుచేసి ఆస్ట్రేలియన్ ఓపెన్ కైవసం


ఆస్ట్రేలియన్ ఓపెన్ ట్రోఫీతో మాడిసన్ కీస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను 19వ సీడ్, అమెరికాకు చెందిన మాడిసన్ కీస్ కైవసం చేసుకుంది. శనివారం జరిగిన మూడుసెట్ల హోరాహోరీ ఫైనల్లో కీస్.. టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకాపై విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో కీస్ 6-3, 2-6, 7-5 తేడాతో ప్రపంచ నెంబర్ వన్ సబలెంకను ఓడించింది. 29 ఏళ్ల మాడిసన్ కీస్‌కు ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఇది మాడిసన్ కీస్‌కు తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్ కావడం విశేషం. ఫైనల్లో విజయం ద్వారా మాడిసన్ కీస్.. ఆస్ట్రేలియా ఓపెన్ గెలిచి వరుసగా మూడుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారిణిగా గుర్తింపు పొందాలని భావించిన సబలెంక ఆశలపై నీళ్లు చల్లింది. మెల్‌బోర్న్ పార్క్‌లో వరుసగా 20మ్యాచ్‌లు గెలిచిన సబలెంక రికార్డుకు బ్రేక్ పడింది. 1968లో ఓపెన్ ఎరా ప్రారంభమైనప్పటి నుంచి అతి ఎక్కువ వయస్సులో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన నాలుగో క్రీడాకారిణిగా మాడిసన్ కీస్ నిలిచింది.


రన్నరప్ ట్రోఫీతో సబలెంక

నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్..

పురుషుల సింగిల్స్ టైటిల్‌పోరుకు ఆదివారం జరగనుంది. టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్, 2వ సీడ్, జర్మనీకి చెందిన జ్వెరేవ్‌ల మధ్య తుది సమరం జరగనుంది. ఈ మ్యాచ్ మ.2.00గం॥లకు జరగనుంది.

కొల్లేరు సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

- పరిరక్షణ కమిటీ సమావేశంలో ఎంపి, పలువురు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అభివాదం చేస్తున్న నాయకులు

కొల్లేరు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, అప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు తెలిపారు. కొల్లేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొల్లేరు ప్రజల ఐక్యత సమావేశం ఏలూరు జిల్లా కైకలూరులో ట్రావెల్స్ బంగ్లాలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మహేష్ కుమార్ హాజరు కాగా, కొల్లేరు ప్రాంత ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడి నాయకులు ఎంపికి, ఎమ్మెల్యేలకు వివరించారు. ముందుగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, ఇక్కడి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. దీనిపై సిఎం, డిప్యూటీ సిఎంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడాల్సి ఉందని తెలిపారు. మహేష్ కుమార్ మాట్లాడుతూ.. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి టిడిపి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కొల్లేరు ప్రజలను అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దని హితవు పలికారు. అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధుల మైనందున అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలకు లోబడి పనిచేయాల్సి ఉందని తెలిపారు. కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలపై జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు అవగాహన ఉందని, పెద్దలందరి సహకారంతో కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం జరిగేందుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కొల్లేరు సమస్యపై సుప్రీంకోర్టులో కూడా పోరాడాల్సి ఉందని, ఆ బాధ్యతను తీసుకుంటానన్నారు. కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

మధ్యవర్తిత్వంపై మెలకువలు అవసరం

- న్యాయవాదుల సదస్సులో జస్టిస్ రవినాథ్ తిల్హారి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



న్యాయవాదుల సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ రవినాథ్ తిల్హారి

న్యాయవాదులు మధ్యవర్తిత్వ పద్ధతులపై మెలకువలు పెంపొందించుకోవడం ద్వారా కక్షిదారులకు తక్కువ ఖర్చుతో సత్వర న్యాయాన్ని అందించవచ్చని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హారి తెలిపారు. గుంటూరులో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం న్యాయవాదులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాథ్ తిల్హారి మాట్లాడుతూ.. పెరిగిపోతున్న కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఒక మంచి అవకాశమన్నారు. ఈ ప్రక్రియ ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. కుటుంబ తగాదాలకు సంబంధించిన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుంటే ఇరుపక్షాలకు ఉపయోగకరమని తెలిపారు. మధ్యవర్తిత్వాన్ని మరింతగా అందుబాటులోకి తేవడానికి న్యాయవాదులు ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. ముగింపు సభలో రాష్ట్ర హైకోర్టు న్యాయ సేవల కమిటీ చైర్మన్ జస్టిస్ రావు రఘునందన్‌రావు మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం కోసం ఇటీవల చట్టాల్లో అనేక సవరణలు చేశారన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా మధ్యవర్తిత్వం నిర్వహించే వెసులుబాటు ఉందని తెలిపారు. హైకోర్టు, జిల్లా కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టాలంటే న్యాయవాదులు మధ్యవర్తులుగా కేసులు పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మంది న్యాయవాదులు మాత్రమే మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి శిక్షణ పొందారని, ఈ సంఖ్య కనీసం 40 వేలకు చేరితేనే పెండింగ్ కేసుల సంఖ్య తగ్గుముఖం పడుతుందని తెలిపారు. సదస్సులో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి యం బబిత, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్థసారథి, హైకోర్టు న్యాయ సేవల కమిటి కార్యదర్శి జి.మాలతి, ఉపకార్యదర్శి డాక్టర్ హెచ్ అమరంగేశ్వరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి, సీనియర్ ట్రైనర్స్ రత్నతార, అరుణాచలం, హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిదంబరం తదితరులు ప్రసంగించారు.



'గాంధీ తాత చెట్టు'పై రామ్‌చరణ్ దంపతుల ప్రశంసలు

ప్రముఖ దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతవేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీతాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకురాలు. మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడి ఎన్నో అవార్డులను గెల్చుకుంది. ఉత్తమ బాలనటిగా సుకృతవేణి పురస్కారాన్ని కూడా అందుకున్నారు. శుక్రవారంనాడు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. ఈ చిత్ర యూనిట్‌ను టాలీవుడ్ కథానాయకుడు రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసనలు ప్రత్యేకంగా అభినందించారు. చిత్ర సమర్పకురాలు తబితా సుకుమార్; దర్శకురాలు పద్మ, నిర్మాత సింధు, రాగ్‌మయూర్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ పడ్డాను


రష్మిక


'ఒక విషయంలో రాజీ పడ్డాన'ని తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రష్మిక చెప్పారు. కుటుంబానికి సమయాన్ని ఎక్కువగా కేటాయించ లేకపోతున్నందుకు బాధపడుతున్నానని అన్నారు. తన కెరీర్ విషయంలో కుటుంబసభ్యులు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. సక్సెస్ కోసం ఎంతో శ్రమించాలని.. ఆ సమయంలో కొన్ని విషయాల్లో రాజీ పడాల్సి ఉంటుందని ఆమె చెప్పారు. 'కెరీర్ పరంగా బిజీగా ఉండడం వల్ల కుటుంబంతో వీలైనంత ఎక్కువ సమయం గడపలేకపోతున్నా. ఈ ప్రయాణంలో నేను రాజీపడిన అతిపెద్ద విషయం ఇదే. వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలకు ఒకేసారి సమయాన్ని కేటాయించడం అంత సులభం కాదు. ఒకదాని కోసం మరొకటి త్యాగం చేయాల్సి ఉంటుంది. అని కెరీర్‌లోకి అడుగుపెట్టిన సమయంలో మా అమ్మ చెప్పిన మాట నాకింకా గుర్తుంది. వృత్తిపరమైన కమిట్‌మెంట్స్ నిలబెట్టుకోవడానికి ఫ్యామిలీ టైమ్ త్యాగం చేయాల్సి ఉంటుంది' అని చెప్పారు. 'కుటుంబమే నా బలం. కీలక సమయాలను కుటుంబంతోనే గడుపుతా. నా చెల్లి అంటే నాకెంతో ఇష్టం. ప్రతిరోజూ మేమిద్దరం మెసేజ్‌లు చేసుకుంటాం. వరుస షూటింగ్స్ వల్ల తనతో గడిపే సమయాన్ని ఎంతగానో మిస్ అవుతున్నా. తను చాలా స్మార్ట్. రానున్న రోజుల్లో అద్భుతమైన మహిళగా మారనుందని నమ్ముతున్నా. వీలున్నప్పుడల్లా కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మాట్లాడుతుంటా' అని మాట్లాడారు.

ప్రమాదంలో పడ్డాం...



నాగ చైతన్య, చందూ మొండేటి దర్శకత్వంలో వస్తోన్న 'తండేల్' చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సినిమాటోగ్రాఫర్ శ్యామ్‌దత్ చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'సినిమా షూటింగ్ లొకేషన్స్ రెక్కీ కోసం వెళ్ళినప్పుడు సముద్రంలో ఒక చిన్నపాటి ప్రమాదం జరిగింది. నేను, డైరెక్టర్ యాక్షన్ కొరియోగ్రాఫర్ సహా కొంతమంది కో డైరెక్టర్లు ఒక పడవలో లోపలికి వెళ్ళాం. అలా లోపలికి వెళ్ళిన సమయంలో పడవ ఒక రాతికి గుద్దుకుంది. అలా గుద్దుకోవడం వల్ల పడవకు రంధ్రం ఏర్పడి నీళ్లు లోపలికి వచ్చాయి. పడవ ఒక పక్కకి ఒరిగిపోయింది. నిస్సహాయ స్థితిలో చేతులు ఊపుతూ సహాయం చేయమని దూరంగా వెళుతున్న పడవల్లోని వాళ్ళని అడిగాం. ఒక పడవ వారు వచ్చి పడవను లాక్కుని బయటికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అది సాధ్యం కాక, మమ్మల్నే ఆ పడవలోకి ఎక్కించుకుని ఒడ్డుకు తీసుకొచ్చారు' అని చెప్పారు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. శ్యామ్‌దత్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు, నవీన్ నూలి ఎడిటర్‌గా, శ్రీనాగేంద్ర తంగల ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

'పుష్ప 3' ఐటెం సాంగ్‌లో జాన్వీ?



అల్లు అర్జున్ కథానాయకుడుగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'పుష్ప 3'. పుష్ప సిరీస్ గురించి సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. పుష్ప మొదటి పార్టులోని ఐటెం సాంగ్‌కు సమంత, పార్ట్ 2కు శ్రీలీల డ్యాన్స్ చేశారు. మూడో పార్టులో బాలీవుడ్ కథానాయిక జాన్వీ కపూర్‌ను ఎంపికచేసే అవకాశాలు ఉన్నాయి. జాన్వీకపూర్ ఉంటే బాగుంటుందని దేవీశ్రీప్రసాద్ ప్రకటించారు. ఇండస్ట్రీలో సాయిపల్లవి డ్యాన్స్‌కు తాను అభిమానినని చెప్పిన దేవీశ్రీప్రసాద్ జాన్వీకపూర్ కూడా మంచి డ్యాన్సర్ అని పేర్కొన్నారు. ఇప్పటికే బాలీవుడ్‌లో ఆమె నటించిన పాటలు చూశానని తెలిపారు. ఆమె తల్లి శ్రీదైవిలో ఉన్న గ్రేస్ జాన్వీలో కూడా ఉందని అభిప్రాయపడ్డారు. పుష్ప 3 ఐటెం సాంగ్‌కు జాన్వీ అయితే సరైన ఎంపిక అని తాను అనుకుంటున్నట్లుగా వివరించారు. అయితే ఎంపిక విషయం దర్శక, నిర్మాతలపై ఉంటుందన్నారు.

మహేష్ లాక్ అయ్యాడు



మహేష్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు. ఇన్‌స్టా వేదికగా దర్శకుడు రాజమౌళి ఓ వీడియోను పంచుకున్నారు. అందులో సింహాన్ని బోనులో బంధించినట్లు, పాస్‌పోర్ట్ చూపిస్తూ కనిపించారు. రాజమౌళి సినిమా అంటే కీలక నటీనటులు, సాంకేతిక నిపుణులకు మరో కమిట్‌మెంట్ ఉండదు. ఆయన సినిమా పూర్తయ్యే వరకూ మరో సినిమా చేసే అవకాశాలు ఉండవు. అంటే సినిమా షూట్ పూర్తయ్యేవరకూ మహేష్ లాక్ అయినట్లే. ఆ సింబాలిక్‌గానే సింహాన్ని బంధించినట్లు వీడియోను క్రియేట్ చేశారు. బ్యాగ్రౌండ్‌లో 'స్పైడర్' మూవీలో మ్యూజిక్‌ను వాడారు. రాజమౌళి పెట్టిన పోస్టుకు, 'ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే వినను' అంటూ మహేశ్ స్పందించగా, 'ఎట్టకేలకు..' సమాధానం ఇచ్చారు' అని ప్రియాంక చోప్రా పోస్టు చేశారు. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ కథ అందించారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ముంబయికి షాక్

- జమ్ముకాశ్మీర్ ఐదు వికెట్ల తేడాతో సంచలనం విజయం
- రంజీట్రోఫీ



ముంబయి: 42సార్లు రంజీ టోర్నీ టైటిల్‌ను కైవసం చేసుకున్న ముంబయికి జమ్మూకాశ్మీర్ ఝలక్ ఇచ్చింది. ముంబయి నిర్దేశించిన 207పరుగుల లక్ష్యాన్ని జమ్ము-కాశ్మీర్ జట్టు 5వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఛేదనలో భాగంగా జమ్మూకశ్మీర్ ఓ దశలో 159 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కానీ ఆరో వికెట్‌కు అబిద్ ముస్తాక్(32), కన్హయ్య వద్వాన్(19) అజేయంగా 46 పరుగులు జోడించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ముంబయి బౌలర్ షామ్స్ ములానీ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, ఓపెనర్ యశస్వి జైస్వాల్ ముంబయి తరఫున బరిలోకి దిగినా.. వీరిద్దరూ స్వల్ప స్కోర్లకే ఔటయ్యారు. రోహిత్ తొలి ఇన్నింగ్స్‌లో మూడు, రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులు చేయగా.. జైస్వాల్ తొలి ఇన్నింగ్స్‌లో 4, రెండో ఇన్నింగ్స్‌లో 26పరుగులే చేశారు. ముంబయి ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్(119) మాత్రమే ఆశించిన స్థాయిలో రాణించాడు. జమ్ము ప్లేయర్ యుధిర్ సింగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అతను ఈ మ్యాచ్‌లో ఏడు వికెట్లకి తోడు తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన 20 పరుగులు చేశాడు. రంజీ ట్రోఫీ గ్రూపు సీ మ్యాచ్‌లో.. కర్నాటక చేతిలో పంజాబ్ ఓడిపోయింది. ఇన్నింగ్స్ 207 తేడాతో ఓటమి చవిచూసింది. పంజాబీ బ్యాటర్ శుభమన్ గిల్ సెంచరీ చేసినా తమ జట్టును గెలిపించలేకపోయాడు. పంజాబ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 55, రెండో ఇన్నింగ్స్‌లో 213 రన్స్ చేసింది. కర్నాటక తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 475 రన్స్ చేసింది. రవిచంద్రన్ స్మరన్ 203 రన్స్ చేశాడు.

ఆంధ్రకు ఆధిక్యత..

గ్రూప్-బిలో పాండిచ్చేరితో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు 43పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. మూడోరోజు పాండిచ్చేరిని ఆంధ్ర బౌలర్లు 260పరుగులకే ఆలౌట్ చేశారు. పృథ్వీరాజ్‌కు ఐదు, విజయ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 248పరుగులు చేసింది. శ్రీకర్ భరత్(41), కరణ్ షిండే(86నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో ఆంధ్ర జట్టుకు ఇప్పటికే 291పరుగుల ఆధిక్యతలో నిలిచింది.

ఫాలో ఆన్‌లో హిమాచల్‌ప్రదేశ్..

హైదరాబాద్‌తో జరుగుతున్న మరో మ్యాచ్‌లో హిమాచల్ ప్రదేశ్ జట్టు ఫాలో ఆన్‌లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 565పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం హిమాచల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 275పరుగులకే ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన హిమాచల్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్లేమీ నష్టపోకుండా 21పరుగులు చేసింది.

ఐసిసి టి20 జట్టు కెప్టెన్‌గా రోహిత్

- మహిళల విభాగంలో ముగ్గురికి చోటు



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) 2024 ఏడాదికి ఉత్తమ టి20 జట్టును ప్రకటించింది. ఐసిసి శనివారం ప్రకటించిన టి20 అత్యుత్తమ జట్టులో నలుగురు టీమిండియా ఆటగాళ్లకు చోటు దక్కింది. గత ఏడాది టి20 ప్రపంచకప్ గెలిచిన భారతజట్టు నుంచి ఇద్దరు ఈ జాబితాలో ఉన్నారు. ఐసిసి టి20 కెప్టెన్‌గా రోహిత్ శర్మను ఎంపిక చేసింది. ఇక మహిళల జట్టులో ముగ్గురు భారత ఆటగాళ్లకు చోటు దక్కింది. స్మృతి మంధాన, రిచా ఘోష్, దీప్తి శర్మ బెస్ట్ టీమ్‌లో ఐసిసి చోటు కల్పించింది. ఇక దక్షిణాఫ్రికా నుంచి ఇద్దరికి చోటు దక్కగా.. జట్టు కెప్టెన్‌గా దక్షిణాఫ్రికా ప్లేయర్ వోల్వార్డ్‌ను ఎంపిక చేసింది. భారత్ నుంచి నలుగురు, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, జింబాబ్వే నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు. రోహిత్ శర్మ 2024లో 11మ్యాచ్‌లలో 42 సగటు, 160.16 స్ట్రయిక్ రేట్‌తో 378 పరుగులు చేశాడు. ఇందులో 121 పరుగులు బెస్ట్ స్కోర్ ఉంది. ఇక ఆల్‌రౌండర్ హార్దిక్ గత ఏడాది 17 మ్యాచుల్లో 352 పరుగులు చేసి 16 వికెట్లు పడగొట్టాడు. 50పరుగులు అత్యుత్తమ స్కోర్. భారత్ టి20 ప్రపంచకప్ గెలుపులో కీలక పాత్ర పోషించిన బుమ్రా గత ఏడాది ఎనిమిది టి20ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. ఏడు పరుగులకు మూడు వికెట్లు తీశాడు. అర్ష్‌దీప్ 18 మ్యాచుల్లో 13.50 సగటుతో 36 వికెట్లు తీశాడు. అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన తొమ్మిది పరుగులకు నాలుగు వికెట్లు.

ఐసిసి టి20 టీమ్ ఆఫ్ ది ఇయర్: రోహిత్(కెప్టెన్-భారత్), హెడ్(ఆస్ట్రేలియా), సాల్ట్(ఇంగ్లండ్), బాబర్(పాకిస్తాన్), పూరన్(వికెట్ కీపర్), సికిందర్ రాజా(జింబాబ్వే), హార్దిక్(భారత్), రషీద్ ఖాన్ (ఆఫ్ఘనిస్తాన్), వనిందు హసరంగా(శ్రీలంక), బుమ్రా, అర్ష్‌దీప్(భారత్).

ఐసిసి మహిళల టి20 టీమ్ ఆఫ్ ది ఇయర్: వోల్వార్డ్(కెప్టెన్-దక్షిణాఫ్రికా), మారిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా), స్మృతి మంధాన, దీప్తి శర్మ, రిచా ఘోష్(వికెట్ కీపర్-ఇండియా), చమరి అటపట్టు(శ్రీలంక), హేలీ మాథ్యూస్(వెస్టిండీస్), స్కీవర్డ్ బ్రంట్(ఇంగ్లండ్), మెల్లీ కర్(ఆస్ట్రేలియా), ఓర్లా ప్రెండర్‌గాస్ట్(ఐర్లాండ్), సాడియా ఇక్బాల్(పాకిస్తాన్).

ఐసిసి 'టి20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా అర్ష్‌దీప్



దుబాయ్: టీమిండియా ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ 2024 సంవత్సరానికి గాను ఐసిసి టి20 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికయ్యాడు. గత టి20 ప్రపంచకప్‌లో అర్ష్‌దీప్ అద్భుతంగా రాణించాడు. భారత్ జట్టు ప్రపంచకప్ గెలువడంలో కీలక పాత్ర పోషించాడు. గత ఏడాది అర్ష్‌దీప్ 36 వికెట్ల పడగొట్టాడు. ఈ క్రమంలో 2024లో టి20 ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. పాక్ మాజీ కెప్టెన్ బాబర్, ఆస్ట్రేలియా సంచలన బ్యాట్స్‌మెన్ హెడ్, జింబాబ్వే ఆటగాడు సికిందర్ రజాను పక్కన నెట్టి అర్ష్‌దీప్ ఐసిసి టీ20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు ఎంపికయ్యారు. అర్ష్‌దీప్ మాట్లాడుతూ.. తన క్రికెట్ ప్రయాణంలో 2024 టి20 ప్రపంచకప్ గెలవడం మరపురాణి క్షణాలని తెలిపాడు. అర్ష్‌దీప్‌కు బిసిసిఐ ట్విట్టర్(ఎక్స్)లో శుభాకాంక్షలు తెలిపింది.

వైవిధ్యం ఆచరిస్తేనే సమానత్వం !

- ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధ



న్యూఢిల్లీ : స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏళ్లు పూర్తి చేసుకుని అజాదీ కా అమృత మహోత్సవ్ కాలంలో వున్న మన దేశం విశిష్టమైన గొప్పతనాన్ని, వైవిధ్యభరితమైన సంస్కృతిని చాటిచెబుతూ మనం ఈ పండుగను జరుపుకుంటున్నామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ 75వ గణతంత్ర దినోత్సవం ఎంతో ప్రత్యేకమైనదని, విశిష్టమైనదని వ్యాఖ్యానించారు. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె శనివారం రాత్రి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. భారతదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ పశ్చిమ దేశాల్లోని ప్రజాస్వామ్య భావన కన్నా చాలా ప్రాచీనమైదని అందుకే భారత్‌ను ప్రజాస్వామ్య మాతృకగా పిలుస్తారని ఆమె కొనియాడారు. అనేక ప్రతికూలతలను, అడ్డంకులను, సవాళ్ళను దాటుకుంటూ సాగిన 75ఏళ్ళ సుదీర్ఘ ప్రయాణాన్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వివరించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఆమె ప్రముఖంగా పేర్కొన్నారు. ఆర్థిక, సైన్స్, అంతర్జాతీయ సంబంధాలు సహా పలు రంగాల్లో భారత్ సాధించిన పలు విజయాలను ఈ సందర్భంగా ఆమె వివరించారు. మన మౌలిక విలువలు, సిద్ధాంతాలు, సూత్రాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి వుందన్నారు. ప్రజాస్వామ్యం అంటేనే వైవిధ్యభరితమైన సంస్కృతీ సంప్రదాయాలు, విశ్వాసాలు, ఆచారాలని అన్నారు. ఈ వైవిధ్యతను మనం ఆచరిస్తేనే సమానత్వం సిద్ధిస్తుందన్నారు. లింగ సమానత్వం దిశగా కూడా మనం పురోగతి సాధించామన్నారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించిందన్నారు. నారీ శక్తి వందన్ అభియాన్ మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన సాధనంగా మారుతుందన్నారు.

ఆత్మనిర్భర్ కోసం రైతుల కృషి

గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన 75ఏళ్ళ తర్వాత కూడా దేశంలోని పలు ప్రాంతాలు దారిద్ర్యంలో వున్నాయని, ఆకలి బాధలను ఎదుర్కొంటున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మన విశ్వాసం చెక్కు చెదరలేదన్నారు. ఆ పరిస్థితులను అధిగమించేందుకు మనం అనేక చర్యలు, తీర్మానాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఆహార ధాన్యాలు, ఇతర పంటల విషయంలో మన దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు మన రైతాంగం చెమటోడ్చి నిరంతరంగా శ్రమించిందని అన్నారు. మన కార్మికులు కఠోర శ్రమతో మన తయారీ రంగాన్ని, మౌలిక వసతులను మరింత మెరుగైన రీతిలో వుండేలా తీర్చిదిద్దారన్నారు. ఈ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో మనం చొరవలు తీసుకుంటున్నామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కమ్యూనిటీల అభివృద్ధికి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా పథకాలు రూపొందించిందన్నారు. ప్రాథమిక అవసరాలను ఒక హక్కుగా మార్చడం ద్వారా సంక్షేమం అన్న భావననే ప్రభుత్వం పునర్నిర్వచించిందన్నారు. సాహసోపేతమైన, దార్శనికత, ఆర్థిక బలంతో రాబోయే కాలంలో కూడా మన పురోగతి ఇదే వేగంతో కొనసాగుతుందన్నారు.

పటిష్టమైన ఆర్థిక వ్యవస్థతో వచ్చిన ఆత్మ విశ్వాసంతో మనం ముందుకు వెళుతున్నామన్నారు. ఇటీవలి కాలంలో ప్రధాన దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ జిడిపి వృద్ధిరేటు కొనసాగుతోందన్నారు. సమాజంలోని బలహీన వర్గాల వారికి ఉచిత ఆహారం అందించే పథకాలను కరోనా మహమ్మారి కాలంలో అమలు చేశామని, ఆ తర్వాత కూడా ప్రభుత్వం ఆ పథకాల పరిధిని పెంచి, అమలును కొనసాగిస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతిక చొరవలు పతాక శీర్షికల నుండి మన రోజువారీ జీవితాల్లోకి వచ్చేశాయని ఆమె పేర్కొనానరు. రాబోయే భవిష్యత్తులో ఆందోళన చెందే అంశాలు, అవకాశాలు సృష్టించే రంగాలు కూడా అనేకం వున్నాయన్నారు. ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకుంటే వారు సరికొత్త సరిహద్దులను అన్వేషిస్తూ ముందుకు సాగిపోతున్నారన్నారు. వారి మార్గంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగిస్తూ వారికి మార్గం సుగమం చేయడమే మన ముందున్న కర్తవ్యమని అన్నారు. వారి విశ్వాసమే రేపటి భారతాన్ని నిర్మిస్తుందని ఆమె ఆకాంక్షించారు. యువత మనస్సులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులే మన జాతి నిర్మాతలను ఆమె అభిప్రాయపడ్డారు. మౌనంగా పనిచేసుకుంటూ దేశానికి మరింత మెరుగైన భవితవ్యాన్ని అందించేందుకు ఇతోధికమైన సేవలందించే మన రైతాంగం, కార్మికులకు కచ్చితంగా మనందరం కృతజ్ఞులమై వుండాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. చివరగా ఇటువంటి పర్వదినాన మనసాయుధ బలగాలకు, పోలీసులు, పారా మిలటరీ బలగాలకు భారత్ అభివాదం చేస్తోందన్నారు. వారి ధైర్యసాహసాలే లేకపోతే ఈనాడు మనం లేమని వ్యాఖ్యానించారు. చివరగా మనందరం మనం కృషి చేయగలిగే రంగాల్లో కృషి చేస్తూ, దేశానికి ఇతోధికంగా సేవలందిస్తూ, నిబద్ధతతో వ్యవహరిస్తూ లక్ష్యాల సాధన దిశగా సాగాలని కోరారు.

సిపిఎం సీనియర్ నాయకులు ఐలయ్య మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పేదల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ కెరటం సిపిఎం సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య (75) మృతిచెందారు. కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న సందర్భంలో ఒక్కసారిగా బిపి తగ్గి, గుండెపోటు రావడంతో మరణించారు. ఆయన భౌతికకాయాన్ని సుజాతనగర్ మండల కేంద్రానికి తరలించారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆయనకు కుమారుడు లెనిన్, కుమార్తె జ్యోతి ఉన్నారు. ఇద్దరికి ఆదర్శ వివాహాలు చేశారు. భార్య కాసాని లక్ష్మి 2017లో సుజాతనగర్ సర్పంచ్‌గా సేవలందిస్తూ అకాల మరణంచెందారు. కాసాని మృతి పట్ల పలువురు రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు తీవ్ర సంతాపం సానుభూతి తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు.

ప్రహసనంగా బిజెపి మ్యానిఫెస్టోలు

- మూడవ సంకల్ప్ పత్రం విడుదల

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే నెల 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కోసం ఎన్నికల వాగ్ధానాల పత్రాలను బిజెపి ఒక ప్రహసనంగా కొనసాగిస్తోంది. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామో ఒకే పత్రంలో చెప్పకుండా దశల వారిగా ప్రకటిస్తోంది. ఇప్పటికే రెండు సంకల్ప్ పత్రాలు (మ్యానిఫెస్టోలు) విడుదల చేసిన ఆ పార్టీ శనివారం మూడవ పత్రాన్ని ఆవిష్కరించింది. ఈ మూడో సంకల్ప పత్రాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విడుదల చేశారు. శరణార్థి కాలనీల్లోని ప్రజలకు యాజమాన్య హక్కులను కల్పిస్తామని, బలవంతంగా మూసివేసిన 13 వేలు దుకాణాలను తెరిపిస్తామని హామీలు గుప్పించింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ 17 వేలకు పైగా అనధికార కాలనీలకు యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు ప్రధాని మోడీ ఇప్పటికే ప్రకటించారని తెలిపారు. గతంలో ఈ కాలనీలకు నిర్మాణం, కొనుగోలు లేదా అమ్మకం కోసం అనుమతి లేదని, ఇప్పుడు వారికి పూర్తి యాజమాన్య హక్కుల్ని కల్పిస్తామని తెలిపారు.

గాల్లో కుదుపులకు లోనైన విమానం

- ఆరుగురికి గాయాలు

నైజీరియా : యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం గాల్లో ఉండగా ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. ఈ ఘటనలో సిబ్బంది సహా మొత్తం ఆరుగురు గాయపడ్డారు. దీంతో విమానాన్ని లాగోస్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఈ విషయాన్ని గత శుక్రవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో ఫ్లైట్ రాడార్ సంస్థ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. ఆ వివరాల ప్రకారం ... 245 మంది ప్రయాణికులు, ఎనిమిదిమంది సిబ్బంది, ముగ్గురు పైలట్లతో యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం శుక్రవారం నైజీరియాలోని లాగోస్ నుంచి వర్జీనియాలోని వాషింగ్టన్ డల్లెస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరింది. టేకాఫ్ అయిన 93 నిమిషాల తర్వాత విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా తమ సీట్లలో నుంచి ఎగిరిపడ్డారు. ఫ్లైట్‌లోని ఫుడ్, ఇతర వస్తువులు అన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు. దీంతో వెంటనే విమానాన్ని లాగోస్‌కు దారి మళ్లించి అక్కడ అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అనంతరం గాయపడిన ఆరుగురిని సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది. అయితే ఈ ఘటనకు గల కారణాలు తెలియరాలేదు. ఘటనకు గల కారణాలపై యూఎస్, నైజీరియా అధికారులు దర్యాప్తు చేపట్టారు.

గణతంత్ర వేడుకలకు రంగం సిద్ధం

- కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు
- అలరించనున్న వైమానిక విన్యాసాలు,
- ముఖ్య అతిథిగా ఇండొనేషియా అధ్యక్షుదు సుబియాంతో
- ఈ ఏడాది థీమ్ 'గోల్డెన్ ఇండియన్ హెరిటేజ్, అండ్ డెవలప్‌మెంట్'
- సర్పంచ్‌లు, కళాకారులకు ప్రత్యేక ఆహ్వానాలు



రిపబ్లిక్ డే వేడుకల కోసం విజయవాడలో రిహార్సల్స్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో / విజయవాడ

దేశ 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఢిల్లీలోని కర్తవ్య పథ్ సర్వాంగ సుందరంగా ముస్తాబయింది.ఎటు చూసిన త్రివర్ణ పతాకాలు, పూలతో తయారు చేసిన రిపబ్లిక్ డే కటౌట్లు దర్శనమిస్తున్నాయి.ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంతో హాజరుకానున్నారు. 1950లో ఇండోనేషియా తొలి అధ్యక్షుడు సుకర్ణో భారత తొలి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం 10. 30 నిమిషాలకు జాతీయ గీతం ఆలాపనతో రిపబ్లిక్ డే వేడుకలు ప్రారంభంకానున్నాయి. వమైనాక దళ విన్యాసాలు , విమెన్ డెవిల్స్ బైక్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శౌర్య చక్ర అవార్డుల ప్రధానం చేస్తారు. తర్వాత రాష్ట్రపతి భవన్ నుంచి కర్తవ్యపథ్, ఇండియా గేట్ మీదుగా ఎర్ర కోట వరకు కవాతు సాగనుంది.

ఇండోనేషియా సైనికుల కవాతు...

రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా భారత త్రివిధ దళాలతో కలసి ఇండొనేషియా ఆర్మీ కూడా పాల్గొననుండడం విశేషం. మొత్తం 90 నిమిషాల పాటు జరిగే పరేడ్ కోసం 600 గంటల పాటు ఎముకలు కొరికే చలిలో సైనిక బందాలు ప్రాక్టీస్ చేశాయి. ఈ ఏడాది పరేడ్‌లో పిరమిడ్ ఆకారంలో సరిహద్దు భద్రతా దళం చేసే డేర్ డెవిల్స్ విన్యాసాలు మరో ప్రత్యేకతగా నిలవనున్నాయి. చివర్లో త్రివిధ దళాలకు చెందిన 47 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ఫ్లై ఫాస్ట్ లో పాల్గొననున్నాయి.

ఈసారి 26 శకటాల ప్రదర్శన...

ఈసారి 'స్వర్ణిమ్ భారత్ - విరాసత్ అవుర్ వికాస్' ఇతివత్తంతో శకటాలను ప్రదర్శించనున్నారు. ఇందులో 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, 10 మంత్రిత్వ శాఖలకు చెందిన శకటాలు పాల్గొననున్నాయి. ఏపి, గోవా, ఉత్తరాఖండ్, హర్యానా, జార్కండ్, గుజరాత్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, త్రిపుర, కర్ణాటక, పశ్చిమ బంగాల్, ఛండీగఢ్, ఢిల్లీ, దద్రానగర్ హవేలీ రాష్ట్రాల శకటాలు ఉన్నాయి. అయితే ఈసారి తెలంగాణ శకటానికి ఆదిలోనే సెర్మోనియల్ కమిటీ తిరస్కరించింది. ఏపి ఏటికొప్పాక బొబ్బలతో పర్యావరణ హిత బొమ్మలు ఇతివత్తంగా 'తిరుమల వేంకటేశ్వర స్వామి శకటాన్ని' ప్రదర్శించనుంది. కాగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన శకటాలను కూడా ప్రదర్శించనున్నారు.

భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం

రిపబ్లిక్ డేలో భాగంగా కర్తవ్య పథ్ ఏరియాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఢిల్లీ పోలీసులు సెంట్రల్ ఢిల్లీని మొత్తంగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి ఇండియా గేట్ రోడ్ ను మూసివేసారు. అలాగే జమ్ము కాశ్మీర్‌లో కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు.

గణతంత్ర వేడుకలకు స్టేడియం ముస్తాబు

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌ను పూర్తి చేశారు. ప్రభుత్వ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, డిజిపి ద్వారకా తిరుమలరావు, డిఐజి బి.రాజకుమారి, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్, నగర పోలీస్ కమిషనర్ బి.రాజశేఖర్‌బాబు, వివిధ శాఖల రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించారు. ఉదయం 8.57 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, 8.58 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ స్టేడియం వద్దకు చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీస్ పెరేడ్‌ను పరిశీలించి తిరిగి వేదిక వద్దకు చేరుకుని వివిధ దళాల నుండి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ వేడుకల్లో వివిధ శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై రూపొందించిన శకటాలను ప్రదర్శిస్తారు. స్టేడియం, పరిసర ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగరంలో ఉదయం 7 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. వేడుకలకు హాజరయ్యే వారికి అధికారులు పార్కింగ్ ప్రదేశాలను, ప్రవేశ మార్గాలను సూచిస్తూ స్టేడియం పరిసరాల్లో పలుచోట్ల బోర్డులను ఏర్పాటుచేశారు.

మరో నలుగురికి హమాస్ విముక్తి

- రెడ్‌క్రాస్‌కు ఇజ్రాయిలీ మహిళా జవాన్ల అప్పగింత
- 70 మంది పాలస్తీనీయన్ల విడుదల



ఇజ్రాయిల్ చెర నుంచి విముక్తి పొందిన చిన్నారులు, మహిళల బావోద్వేగం.

గాజా సిటీ : తమవద్ద బందీలుగా వున్న నలుగురు ఇజ్రాయిలీ మహిళా సైనికులను హమాస్ కార్యకర్తలు శనివారం రెడ్‌క్రాస్‌కు అప్పగించారు. అప్పగించడానికి ముందు వారిని జనాల ఎదుట ప్రదర్శనగా తీసుకువెళ్లారు. గాజా నగరంలోని పాలస్తీనా స్క్వేర్ వద్ద గల వేదికపై నిలుచుని ఆ నలుగురు మహిళలు నవ్వుతూ వేలాదిమంది ప్రజలకు చేయి ఊపుతూ కనిపించారు. వారందరూ 20 ఏళ్ళ లోపు వయస్సు వారే. అనంతరం వారు అక్కడ వేచి వున్న రెడ్‌క్రాస్ వాహనాల్లో వెళ్ళిపోయారు.

మరోవైపు, ఇందుకు ప్రతిగా ఇజ్రాయిల్ అక్రమంగా బంధించిన మహిళలు, పిల్లల్లో 70 మంది పాలస్తీనీయన్లను విడుదల చేసింది. అయితే వారిని తిరిగి గాజా లేదా వెస్ట్ బ్యాంక్‌కు వెళ్లనీయకుండా ఆంక్షలు విధించింది. ఈజిప్ట్ ప్రభుత్వ కహెరా టివి ఈ మేరకు వెల్లడించింది. వారందరూ రాఫా సరిహద్దుల్లో ఈజిప్ట్ వైపునకు చేరుకుంటున్నారని తెలిపింది. హమాస్ చెరలో బందీగా వున్న సామాన్య మహిళ ఒకరు విడుదలై తమ వద్దకు చేరేవరకు పాలస్తీనా ఖైదీలను ఉత్తర గాజాలోకి తిరిగి వెళ్లనివ్వబోమని ఇజ్రాయిల్ తెలిపింది.

అయితే యహూద్‌ను వచ్చే వారం విడుదల చేస్తామని తాము మధ్యవర్తులకు చెప్పామని హమాస్ సీనియర్ అధికారి తెలిపారు. కాగా ఇది చిన్న విషయమేనని ఈజిప్ట్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అయినా ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.



గాజా విడుదల చేసిన ఇజ్రాయిలీ మహిళా జవాన్ల ఆనందోత్సవం

ఇదిలావుండగా, ప్రధాని నెతన్యాహు కార్యాలయం బందీల విడుదల కార్యక్రమ వీడియోను విడుదల చేసింది. శనివారం బందీల విడుదల వుందని తెలిసిన వెంటనే వారిని చూసేందుకు ఉదయం నుండే టెల్ అవీవ్‌లో, గాజా సిటీలో ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. అక్కడ పరిస్థితులను ఎప్పటికప్పుడు లైవ్‌లో చూపిస్తూ ఇజ్రాయిల్ టివి ప్రసారం చేసింది. గత ఆదివారం కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు ముగ్గురు బందీలు విడుదలయ్యారు. ఇందుకు బదులుగా 90మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేశారు. వీరిలో అందరూ మహిళలు, పిల్లలే.

దావోస్ అంటే పెట్టుబడులే కాదు

(మొదటి పేజీ తరువాయి)

రాబోతోందని, దీన్ని అందిపుచ్చుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని, దీనిలో భాగంగా ఎపి బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నామని చెప్పారు. ప్రపంచంలో చాలా దేశాలు ఒక దేశంలో తయారైన వస్తువులను దిగుమతి చేసుకుని మరో దేశానికి ఎగుమతి చేస్తున్నాయని, అది వారి ఆర్థికవృద్ధిని పెంచుతోందని వివరించారు. రాష్ట్రంలో మాత్రం గ్రామాల్లో పండిన పంటను పట్టణాలకు కూడా తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఎకనామిక్ ఫోరంలో గ్రీన్ ఎనర్జీని ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని యువత ఇండియాలో ఉందని, భవిష్యత్‌లో అదే పెద్దవనరుగా మారబోతోందని అన్నారు. 100 దేశాల్లో తెలుగువాళ్లు ఉన్నారని, యూరప్‌లో 25 శాతం మనవాళ్లు ఉన్నారని పేర్కొన్నారు. అమెరికాలో తెలుగు ప్రధాన భాషగా మారిందంటే అది ఎపి వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. 2047 నాటికి అత్యంత ప్రభావితమైన వ్యక్తులుగా తెలుగువారు ఉంటారని విశాఖలో ఐటి రివల్యూషన్ వస్తుందని చెప్పారు. టిసిఎస్ యూనిట్ ఏర్పాటు చేస్తుందని అన్నారు

గేట్‌వేగా సముద్రతీరం

రాష్ట్రానికి ఉన్న సముద్రతీరం ప్రపంచానికి గేట్‌వేగా మారుతుందని, బ్లూ ఎకానమీ మంచి అవకాశాలు, సంపద సృష్టిస్తుందని తెలిపారు. ప్రపంచంలో చాలాదేశాలు సముద్రతీరంపై ఆధారపడి ఆర్థికంగా బలోపేతం అయ్యాయని అన్నారు. ఎపికి పది ఓడరేవులు ఉన్నా వాటిని సమర్థవంతంగా వినియోగించుకోలేక పోతున్నామని అన్నారు. రాష్ట్రాన్ని పెట్రోకెమికల్ హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు. రామాయపట్నంలో బిపిసిఎల్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తుందని అన్నారు. దీనికి రూ.96 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. అనకాపల్లి వద్ద రూ.1.35 లక్షల కోట్లతో స్టీలుప్లాంటు వస్తోందని, రూ.1.87 లక్షల కోట్లతో ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. కాకినాడ నుండి గ్రీన్ అమ్మోనియా ఎగుమతి చేస్తామని చెప్పారు. గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. ఐటి సేవల రంగంలో గూగుల్ ముందుకు వస్తుందని అన్నారు. డీప్‌టెక్‌పై దృష్టి సారిస్తున్నామని వివరించారు. అగ్రిటెక్‌ను పెంపొదిస్తున్నామని చెప్పారు.

విధ్వంసం చేసి గొంతుచించుకుంటున్నారు

రాష్ట్రంలో విధ్వంసం చేసిన కొంతమంది ఇంకా గొంతు చించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో వెయ్యి కోట్ల ప్రాజెక్టయినా తీసుకురాలేకపోయారని, దావోస్ వెళితే తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించారు. ప్రజలకు నష్టం చేశారని, అమరావతి ప్లాను ఇచ్చిన సింగపూర్ వారి మీద కేసులు పెట్టి వేధించారని అన్నారు. అందువల్లే పెట్టుబడిదారులందరూ ఎవరిదారి వారు చూసుకున్నారని వివరించారు.

అభివృద్ధిలో కేరళ ఆదర్శం

దావోస్ పర్యటనలో తమతోపాటు కేరళ పరిశ్రమల శాఖ మంత్రి కూడా వచ్చారని, గతంలో పోలిస్తే కేరళ అన్ని రంగాల్లోనూ ముందుకు వెళుతోందని చెప్పారు. విద్యారంగంలో ఎంతో ముందుందని, అక్కడ నుండి వెళ్లిన వారు ప్రపంచంలో ఎన్నో దేశాల్లో పారిశ్రామికవేత్తలుగా ఉన్నారని తెలిపారు. ఉన్న అవకాశాలను వినియోగించుకుని ఆ రాష్ట్రం పర్యాటకాన్ని ముందుకు తీసుకెళ్లిందని తెలిపారు. దేశంలోనే అభివృద్ధిలో ఆదర్శంగా ముందుకెళుతోందని పేర్కొన్నారు.

జపాన్ సంస్థకు ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్

- ప్రయివేటీకరణలో భాగంగా కట్టబెట్టిన మోడీ సర్కార్
- తీవ్రంగా ఖండించిన సిఐటియు

న్యూఢిల్లీ : మినీ రత్నగా భావించే ప్రభుత్వ రంగ సంస్థ ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్)ను జపాన్ సంస్థ కైవసం చేసుకుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మానటైజేషన్ (నగదీకరణ) పేరిట ప్రభుత్వ సంస్థలన్నిటినీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూవస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ప్రతిష్టాత్మకమైన ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను కూడా జపాన్‌కు చెందిన కొనొయ్‌కా ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్ సంస్థకు కట్టబెట్టింది. కేంద్ర ప్రభుత్వ చర్యను సిఐటియు తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. ఎంఎస్‌టిసి లిమిటెడ్ అనుబంధ సంస్థగా వున్న ఈ సంస్థను జపాన్ కార్పొరేషన్ అయిన కొనొయ్‌కా ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్‌కు అప్పగిస్తూ బిజెపి ప్రభుత్వం మరో హేయమైన నేరానికి పాల్పడిందని సిఐటియు విమర్శించింది. గత దశాబ్ద కాలంగా ఎఫ్ఎస్ఎన్ఎల్ ప్రైవేటీకరణ చర్యలు కొనసాగుతున్నాయని, కానీ కార్మికులు సమైక్యంగా సాగించే పోరాటాల వల్ల ఇంతకాలం ఆగుతూ వచ్చిందని పేర్కొంది. గతేడాది అక్టోబరు 24న జపాన్ సంస్థతో వాటాల కొనుగోలు ఒప్పందంపై సంతకాలు జరిగిన వెంటనే ఎఫ్ఎస్ఎన్ఎల్‌లోని వివిధ యూనియన్లు ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇటువంటి జాతి వ్యతిరేక చర్యలకు దూరంగా వుండాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కానీ వాటిని పెడచెవిన పెట్టిన కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ, ఇరు పక్షాల మధ్య కుదిరిన ఒప్పందంలోని సంబంధిత క్లాజుల కింద ఎఫ్ఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సర్వీసులకు రక్షణ కల్పించబడుతుందని రాతపూర్వకంగా తెలియచేసింది. కానీ ఈ విషయంలో మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని సిఐటియు విమర్శించింది. క్లోజింగ్ తేదీ నుండి ఏడాది కాలం వరకు ఏ ఉద్యోగిని తొలగించడం లేదా పదవీ విరమణ చేయించడం వంటి చర్యలు కంపెనీ తీసుకోదని ఆ వాటాల కొనుగోలు ఒప్పందంలోని సంబంధిత క్లాజు పేర్కొంటోంది. ఇటువంటి ఒప్పందం ద్వారానే కాకుండా మొత్తంగా స్క్రాప్ నిర్వహణా వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేసిందని విమర్శించింది. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించిన సిఐటియు, ఇటువంటి జాతి వ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండిస్తూ ఉధృత పోరు సాగించాల్సిందిగా కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది. బంగారు బాతు వంటి కంపెనీని ఇలా ప్రైవేటు సంస్థకు ధారాదత్తం చేసే చర్యలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేసింది.

శ్రీలంక మాజీ అధ్యక్షులు రాజపక్సా కుమారుడు అరెస్టు

కొలంబో : ఆస్తి కొనుగోలు కేసులో అవినీతి ఆరోపణలపై శ్రీలంక మాజీ అధ్యక్షులు మహిందా రాజపక్సా కుమారుడు యోషితా రాజపక్సాను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. బెలియట్టాలోని తన నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. 2015కి ముందు తన తండ్రి మహిందా రాజపక్సా అధ్యక్షునిగా ఉన్న సమయంలో యోషితా రాజపక్సా ఆస్తుల కొనుగోలు విషయంలో అక్రమంగా ప్రవర్తించినట్లు ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కాగా, మహిందా రాజపక్సా ముగ్గురు కుమారుల్లో రెండవ కుమారుడు యోషిత రాజపక్సా. కటరామగామలోని హాలిడే హోమ్‌లో మహిందా రాజపక్సా సోదరుడు గొటబాయ రాజపక్సాని కూడా ఇదే కేసులో పోలీసులు గతవారం విచారించారు. గత నెలలో దిసనాయకె ప్రభుత్వం తన భద్రతను తగ్గించిందని, గతంలో మాదిరిగా భద్రతను పునరుద్ధరించడానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ మహింద రాజపక్సే శుక్రవారం (జనవరి 24) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో మహిందా కుమారుడు యోషితను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీలంకలో అధ్యక్షులు అనుర కుమార దిసనాయకె నేతృత్వంలో గత ఏడాది నవంబర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. గతంలో మరొక ఆస్తి కేసులో మహింద రాజపక్సే పెద్ద కుమారుడు నమల్ రాజక్సాను, మహింద రాజపక్సే ఉద్యోగిని పోలీసులు విచారించారు.

విదేశాలకు సాయాలను నిలిపివేసిన అమెరికా

వాషింగ్టన్ : అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాలకు, విదేశీ సంస్థలకు అందిస్తున్న సాయాన్ని స్తంభింపచేస్తూ అమెరికా విదేశాంగ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇజ్రాయిల్, ఈజిప్ట్‌లకు సైనిక సాయాన్ని మాత్రం కొనసాగించనున్నట్లు పేర్కొంది. ఆరోగ్యం, విద్య, అభివృద్ధి, ఉపాధి శిక్షణ, అవినీతి నిరోధక, భద్రత, ఇంకా ఇతర రంగాలకు మద్దతుగా అంతర్జాతీయంగా అమెరికా నిధులతో నడిచే ప్రాజెక్టులకు కోట్లాది డాలర్లు నిలిచిపోయే ముప్పు ఏర్పడింది. 2023లో ఇది 60బిలియన్ల డాలర్లుగా, అంటే అమెరికా బడ్జెట్‌లో ఒక శాతంగా వుంది.

విజయసాయిరెడ్డి రాజీనామా ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి రాజ్యసభ ఎంపి వి విజయసాయి రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఆమోదించారు. శనివారం రాజ్యసభ సభ్యులుగా విజయసాయిరెడ్డి రాజ్యసభ ఛాంబర్‌లో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌కు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన రాజీనామాను ఛైర్మన్ ఆమోదించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ శనివారం బులిటెన్ విడుదల చేశారు.



రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న విజయసాయిరెడ్డి

జగన్‌తో అన్నీ చర్చించే రాజీనామా చేశా : విజయసాయి రెడ్డి

రాజీనామా అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగన్ అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు అని ఆయన తెలిపారు. తనలాంటి వాళు వెయ్యి మంది వెళ్లినా జగన్‌కు ఆదరణ తగ్గేదే లేదని అన్నారు. తాను రాజీనామా చేయడానికి ముందు జగన్‌తో అన్ని విషయాలూ చర్చించానన్నారు. పదవికి రాజీనామా చేయడం సరికాదని కూడా జగన్ సూచించారని తెలిపారు. కానీ పదవికి న్యాయం చేయలేకపోతున్నా కాబట్టే రాజీనామా చేస్తున్నానని అన్నారు. అబద్ధాలు చెప్పకుండా ఈ రోజుల్లో రాజకీయాలు చేయడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. తనపై ఆరోపణలు చేసిన వాళ్లు తిరుమలకు వస్తే ప్రమాణానికి సిద్ధమని సవాల్ చేశారు. సీటు కూటమికి వస్తుందని తెలిసినప్పటికీ రాజీనామా చేశానని తెలిపారు. తనపై 22 కేసులు ఉన్నాయని, ఎప్పుడూ భయపడే వ్యక్తిని కాదని అన్నారు. 2014లో తనను అప్రూవర్‌గా మారాలని ఎంతో బలవంతపెట్టారని, అయినప్పటికీ నిరాకరించానని తెలిపారు. అప్పుడు ఉన్న పరిస్థితులే ఇప్పుడు కూడా ఉన్నాయని చెప్పారు. తాను వీడినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని అన్నారు. తనలాంటి వాళ్లు పార్టీలో ఇంకా ఉన్నారని, భవిష్యత్తులో వస్తారని తెలిపారు. రాజకీయాల నుంచి తప్పుకుంటే ఇంకా బలహీనుడిని అవుతానని తెలుసని, అలాంటప్పుడు కేసులు ఎందుకు మాఫీ చేస్తారని ప్రశ్నించారు. రాజ్యసభ ఎంపిగా అటు రాష్ట్రానికి, ఇటు పార్టీకి న్యాయం చేయలేనని వ్యాఖ్యానించారు. రాజీనామాలో ఎవరి ఒత్తిడి లేదని, ఎవరికీ భయపడే తత్వం తనది కాదని అన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి చనిపోయినట్లు ఒక వ్యక్తి తనకు ఫోన్ చేసి చెప్పారని అన్నారు. ఆ విషయం తెలియగానే తానూ ఆశ్చర్యపోయానన్నారు. వెంటనే పులివెందులలో ఉన్న అవినాశ్ రెడ్డికి ఫోన్ చేస్తే గుండెపోటు అని చెప్పారని అన్నారు. తనకు ఫోన్‌లో చెప్పిన విషయాన్నే మీడియా ముందు చెప్పానని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

చీనాబ్ బ్రిడ్జిపై వందేభారత్ ట్రయల్ రన్

జమ్మూ కాశ్మీర్ : జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన పై వందేభారత్ రైలు ఫస్ట్ ట్రయల్ రన్‌ను శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా వైష్ణో దేవి కత్రా స్టేషన్ నుంచి శ్రీనగర్ స్టేషన్ వరకూ వందే భారత్ పరుగులు తీసింది. టికెట్ ధర విషయానికి వస్తే.. ఢిల్లీ నుంచి కాశ్మీర్‌కు రూ.1,500 నుంచి రూ.2,100గా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. రైలు మార్గమధ్యలో జమ్మూ, వైష్ణోదేవి కత్రాలో స్టాప్స్ ఉండనున్నట్లు సమాచారం.

కాశ్మీర్ లోయలోని అతిశీతల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ఈ రైలును ప్రత్యేకంగా రూపొందించారు. నీరు గడ్డ కట్టకుండా ఉంచేలా అత్యాధునిక హీటింగ్ వ్యవస్థలను ఇందులో ఏర్పాటు చేశారు. కాగా.. గతేడాది జూన్‌లో ఈ వంతెనపై రైలు ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విషయం తెలిసిందే. నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తునున్న ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు. ఇప్పటివరకూ చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం.



గణతంత్ర దినోత్సవం

పరతంత్రం పోయెను
గణతంత్రం వచ్చెను
బానిస సంకెళ్ళు
తునాతునకలాయెను

నింగిలోన జెండా
ఎంచక్కా ఎగిరెను
మోదము మది నిండా
జలాశయాలాయెను

ఎందరో త్యాగధనుల
ఆత్మ బలిదానాలు
మన ఘన మాతృమూర్తుల
ఎన్నెన్నో త్యాగాలు

వచ్చిన స్వాతంత్ర్యము
పోయిన పరతంత్రము

అక్షరాల సత్యము
గుర్తుంచుకో! నిత్యము

ఈనాటి ఈ స్వేచ్ఛ
పోరాటాల ఫలితము
ఆనాటి మహాత్ములను
స్మరించాలి సతతము

గణతంత్ర దినోత్సవ
శుభాకాంక్షలందరికి
కైమోడ్పులు చేతును
అమర వీరులందరికీ ...

– గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
99664 14680.

పదండి ముందుకు

కదలండి ముందుకు
గణతంత్ర వేడుకలకు
భారతావనిని కీర్తిస్తూ
'జైహింద్' అని నినదిస్తూ
'వందేమాతరం' పాడేస్తూ
స్వతంత్ర వీరులను స్మరిస్తూ ...


పదండి ముందుకు
స్వేచ్ఛా సంబరాలకు
అల్లూరి అడుగులతో
భగత్ సింగ్ పిడుగులతో
ఆజాద్ మెరుపులతో
సర్దార్ ఉరుములతో
సాగండి ముందుకు
జెండా పండుగకు

గాంధీజీ సిద్ధాంతాలతో
నెహ్రూజీ ఆచరణలతో
అంబేద్కర్ ఆశయాలతో
సుభాష్ సంకల్పంతో
ఎగురవేయండి వినువీధిలో
త్రివర్ణ పతాక రెప రెపలను

– కయ్యూరు
బాలసుబ్రమణ్యం,
77802 77240.


నేను గీసిన బొమ్మ







ఎన్.హిమసాత్వి,
4వ తరగతి,
సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్,
చినకాకాని. మంగళగిరి



పి.సాత్విక,
5వ తరగతి, సుందరయ్యనగర్,
తాడేపల్లి మున్సిపాలిటీ,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



మీ కోసం


మినప్పప్పులో రెండు చుక్కల నూనె వేసి బాగా కలిపి నానబెడితే పొట్టు త్వరగా ఊడుతుంది.

జీవన సౌరభం

పడిపోతామని భయపడితే నడక రాదు. ఓడిపోతామని భయపడితే విజయం రాదు. ప్రయత్నిస్తూ పోతే ఫలితం అదే

JEEVANA జీవన the family

నేర పరిస్థితులు మారినప్పుడే నిజమైన గణతంత్రం



ఈ రోజు మనం 76వ గణతంత్రదినోత్సవం జరుపుకుంటున్నాం. రాజ్యాంగంలో రూపొందించిన ఎన్నో విధివిధానాలను తు.చ తప్పకుండా అనుసరించాలని నియమాలు పెట్టుకున్నాం. మారుతున్న కాలాన్ని బట్టి, పరిస్థితులకు తగ్గట్టుగా దిద్దుబాటులు కూడా చేసుకుంటున్నాం. కానీ మారాల్సింది, మార్చాల్సింది మనలో పేరుకుపోయిన భావజాలం. వ్యవస్థలో పేరుకుపోయిన నిర్లక్ష్యం. తాజాగా జనవరి 20న ఒకే రోజు రెండు సందర్భాల్లో కోర్టులు ఇచ్చిన తీర్పులు ప్రస్తుత పరిస్థితులపై చర్చకు దారితీస్తున్నాయి.

నిర్భయ ఘటన జరిగినప్పుడు దేశం యావత్తు కదిలివచ్చింది. నిందితునికి శిక్ష పడాలని గొంతెత్తి అరిచింది. ఫలితంగానే చట్టం తీసుకొచ్చారు. అయితే చట్టం వచ్చిన తరువాత ఆడపిల్లలపై అఘాయిత్యాలు ఆగిపోతాయని ఎవరూ అనుకోలేదు. ఇంతటితో సమస్య పరిష్కారమైపోయిందనీ భావించలేదు. ఎందుకంటే ఘటనకి ముందులాగే ప్రతి రోజూ ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. 2024 ఆగస్టు 9న ఆర్‌జికర్ యువ డాక్టరు అత్యాచార ఘటన మరోసారి ఆ భయంకర దాడులను కళ్లముందుకు తెచ్చింది.

మొదటి కేసు : ఆర్‌జికర్‌లో అమానుషం

ఆర్‌జికర్ హాస్పటల్లో అత్యంత దారుణంగా వైద్యురాలు అత్యాచారానికి గురైంది. రాత్రి సమయంలో వార్డు విధులు నిర్వహిస్తున్న ఆమెపై అదే సమయంలో భద్రతా బాధ్యతల్లో ఉన్న ఓ ఉద్యోగి ఉన్మాదిలా విరుచుకుపడ్డాడు. అంతర్గత, బాహ్య గాయాలతో, ఛిద్రమైన వ్యక్తిగత అవయవాలతో రక్తపుమడుగులో విలవిలలాడుతూ వైద్యురాలు ప్రాణాలొదిలింది. ఇంత దారుణానికి ఒకే ఒక్కడు తెగబడ్డాడంటే నమ్మశక్యం కాదు. ఆ విషయంపైన దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కాదని కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ రంగంలోకి దిగింది. విచారణ చేసింది. చివరికి ఒక్కడే నిందితుడని తేల్చింది. కోర్టు ముందు హాజరుపరిచింది.

ఐదు నెలల్లో న్యాయం?

ఘటన జరిగిన నాటినుండి పశ్చిమ బెంగాల్ అట్టుడికిపోయింది. దేశ నలుమూలల నుండి వైద్యురాలికి సంఘీభావంగా నిరసనలు వెల్లువెత్తాయి. నిందితుడికి కఠిన శిక్ష వేయాలని లక్షలాదిమంది నినదించారు. చివరికి మొన్న జనవరి 20న కలకత్తా సెషన్ కోర్టు నిందితునికి జీవితఖైదు విధిస్తూ శిక్ష ఖరారు చేసింది. తీర్పు ఇస్తూ న్యాయమూర్తి ఇలా అన్నారు. 'సంఘటన సమయంలో అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయాల వల్లనే ఈ దాడి జరిగింది. ముందునుండి ప్లాన్ చేసుకున్నదిగా ఇది లేదు. అలాగే నిందితుడికి నేర చరిత్ర లేదు. కాబట్టి రాజ్యాంగంలో ప్రస్తావించినట్లు 'అరుదైన వాటిలో అరుదైనది' (రేరెస్ట్ ఆఫ్‌ది రేర్)గా ఈ ఘటనని చూడలేం. కాబట్టి నిందితునికి ఉరిశిక్ష వేయలేం. అతడు మరణించేంత వరకు జైలులోనే గడిపేలా జీవితఖైదు విధిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. నిజమే కన్నుకు కన్ను, పన్నుకు పన్ను కోరే ఆటవిక న్యాయం నుండి మానవులను ఉన్నతీకరించుకునేలా మనం రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. తీర్పు సమయంలో హత్యకి రూ.10 లక్షలు, అత్యాచారానికి రూ.7 లక్షలు పరిహారంగా నిర్ణయించారు. నిందితుడికి రూ.50 వేలు జరిమానా విధించారు.

'పరిహారంతో మాకు న్యాయం జరగద'ని, కోర్టు ప్రాంగణంలో ఉన్న వైద్యురాలి తల్లీదండ్రీ చేతులు జోడించి వేడుకున్నారు. ఆ వేదన ఈ దేశంలో ఎందరో బాధిత తల్లీదండ్రీది. అందుకే తీర్పు వెలువడిన గంటల వ్యవధిలోనే ఎంతోమంది దీనిపై స్పందించారు. ఎక్కువమంది 'వైద్యురాలికి న్యాయం జరగాలంటే నిందితుడికి ఉరిశిక్ష వేయాల్సిందే' అని మాట్లాడారు. బాధితురాలి తల్లీదండ్రీ, ఆ రాష్ట్ర ప్రభుత్వం, ఇంకా ఎందరో ఈ తీర్పుని వ్యతిరేకించారు.

శిక్ష ఎవరికి పడాలి?

నిందితుడికే అయితే, క్షణంపాటు విలవిలలాడుతూ అతడు ప్రాణం వదులుతాడు. అంతటితో ఆ నేరం సమసిపోతుందా? అతడితో అది భూస్థాపితమైపోతుందా? కాదంటే శిక్ష నిందితుడితో పాటు నేరానికి పడాలి? ఆ నేరం జరిగిన పరిస్థితులు మళ్లీ మళ్లీ జరగకుండా వ్యవస్థలో మార్పులు రావాలి. రాత్రి సమయంలో విధులు నిర్వర్తించే ఎందరో మహిళలు ఈ రోజుకీ భయంభయంగానే గడుపుతున్నారు. ఎటువైపు నుండి ఎవరు తమపై దాడులు చేస్తారో అని బెంబేలెత్తిపోతున్నారు. ఆ మహిళలు ధైర్యంగా డ్యూటీలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందా? కనీసం ఘటన జరిగిన తరువాతైనా ఏ ఆస్పత్రిల్లోనైనా రాత్రుళ్లు పనిచేసే మహిళా సిబ్బంది రక్షణకై పూనుకున్నారా? ఎవరికి వారే ప్రశ్నించుకోవాల్సిన విషయమిది.

రెండో కేసు : విష ప్రయోగ హత్య

గ్రీష్మ, షారోన్ రాజ్ ఒకరికొకరు గాఢంగా ప్రేమించుకున్నారు. ఇద్దరూ ఉన్నత విద్య చదువుకున్నారు. అయితే కొన్ని రోజులకు గ్రీష్మ, తల్లిదండ్రులు చూపించిన అబ్బాయిని పెళ్లి చేసుకోవాలనుకుంది. రాజ్‌తో విషయం చెప్పింది. అతడు ససేమిరా అన్నాడు. తల్లి, బంధువులు ఇచ్చిన సలహాతో మంచి మాటలతోనే అతడిని వదిలించుకోవాలని ప్లాన్ వేసింది. మొదటిసారి చేసిన విషప్రయోగం ఫలించలేదు. రెండోసారి చేసిన ప్రయత్నంలో రాజ్ 11 రోజులు ఆస్పత్రి పాలై మరణించాడు. ఈ మొత్తం వ్యవహారం 2022లో జరిగింది. మొన్న జనవరి 20న ఈ కేసులో తిరువనంతపురం కోర్టు తీర్పు ఇచ్చింది.

గ్రీష్మ నిందితురాలే..

ఈ మొత్తం వ్యవహారంలో గ్రీష్మ చేసిన పనిని ఎవరూ స్వాగతించరు. నేరానికి పాల్పడింది, అమ్మాయా? అబ్బాయా? అని కాదు. ఆ నేరం ఎంత తీవ్ర స్థాయిలో జరిగింది! అనేదే కోర్టు చూస్తుంది. అందుకే 'తాను ఉన్నత విద్యావంతురాలినని, చాలా చిన్న వయసని, శిక్ష వేసేటప్పుడు ఇవన్నీ పరిగణించుకోవాలని గ్రీష్మ పెట్టుకున్న అర్జీని కోర్టు పట్టించుకోలేదు. తీర్పు వెలువరిస్తూ న్యాయమూర్తి ఈవిధంగా అన్నారు. 'ఈ కేసులో నిందితురాలు ఒక ప్లాన్ ప్రకారం, ప్రియుడ్ని హత్య చేసింది. ఆమె క్రిమినల్ మెంటాలిటీ చాలా భయంకరంగా ఉంది. పవిత్రమైన ప్రేమ విషయంలో ఈవిధమైన నేరాన్ని అరుదైనదిలో అరుదైనదిగా భావిస్తూ, గ్రీష్మకి ఉరిశిక్ష ఖరారు చేస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈ తీర్పుతో దేశంలో ఉరిశిక్ష పడ్డ అతి పిన్న వయస్కురాలిగా గ్రీష్మ పేరు ఉంది.

ఈ రెండు కేసుల్లో నేర తీవ్రత పరిశీలించినప్పుడు చాలామంది గ్రీష్మ కేసులో వచ్చిన తీర్పుకి విస్తుపోయారు. 'అమ్మాయి కాబట్టి ఉరిశిక్ష వేశారా? అబ్బాయి అని ఆర్‌జికర్ నిందితుణ్ణి తప్పించారా?' అని దుందుడుకు వాదన చేసినవారూ ఉన్నారు. అయితే ఇక్కడ చూడాల్సింది 'ఉరిశిక్ష' కాదు.. కేరళ కేసులో తీర్పు ఇస్తూ న్యాయమూర్తి మరో మాట కూడా అన్నారు. 'ఈ రోజుల్లో చాలామంది యువత లివింగ్ రిలేషన్‌లో ఉంటున్నారు. ఒకవేళ ఎవ్వరైనా బ్రేకప్ చెబితే రెండవ వారు తీవ్ర నేరాలకు పాల్పడేలా ఈ కేసు ఉంది. కాబట్టి భవిష్యత్తులో ఎవ్వరూ ఈవిధమైన చర్యలకు పాల్పడకుండా ఈ తీర్పు ఇస్తున్నాం' అన్నారు.

ఈ రెండు తీర్పులను సవాల్ చేస్తూ నిందితులు పైకోర్టులకు వెళ్లవచ్చు. అంటే ఈ తీర్పులు మారవచ్చు. మారకపోవచ్చు. కాబట్టి ఇప్పుడు చర్చించుకోవాల్సింది, తీర్పుల గురించి కాదు.. నేరం జరిగిన పరిస్థితుల గురించి.. వ్యవస్థలో రావాల్సిన మార్పు గురించి.. ఎప్పుడైతే చర్చలు ఆ దారిలో నడుస్తాయో.. అప్పుడు నిజమైన గణతంత్రం రాజ్యమేలుతుంది. - జ్యోతిర్మయి

జనం మదిలో రాజ్యాంగం

బిజెపి మనసులో మనువాదం



సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించిన మహాప్రదర్శన

- మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం దేశానికే ప్రమాదకరం
- మహా ప్రదర్శనలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'దేశవ్యాప్తంగా ఆదివారం 75వ రాజ్యాంగ దినోత్సవం జరుగుతుంది. స్వాతంత్ర్య పోరాట ఫలితంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం జనవరి 26న అమల్లోకి వచ్చింది. ప్రజలందరి మదిలో రాజ్యాంగం ఉంది. కానీ, బిజెపి నాయకుల మనసులో రాజ్యాంగం లేదు. మనువాదం ఉంది. మనువాదానికి అనుగుణంగానే పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగానే పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారు. ఆయన మనసులో అదాని, గాడ్సే ఉన్నారు. అమిత్ షాకు కేంద్ర మంత్రిగా కొనసాగే అర్హత లేదు. మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలి' అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో నాలుగు రోజులపాటు జరిగే సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభ శనివారం ప్రారంభమైంది. ఐబి కార్యాలయం నుంచి వేలాది మందితో భారీ ప్రజాప్రదర్శన నిర్వహించారు. అనంతరం పిఎస్‌ఆర్ గ్రౌండ్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా బృందాకరత్ హాజరై ప్రసంగించారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఎర్ర జెండాను, ఉద్యమాలను ముందుకుతీసుకెళ్లేందుకు శపథం తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. దేశంలో కార్మికులు, రైతులు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతోందని, కార్పొరేట్లకు మాత్రం రూ.మూడు లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిందని వివరించారు. ప్రజల మధ్య కులం, మతం పేరుతో చిచ్చు పెట్టి రెచ్చగొడుతోందని, ఇది దేశానికే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మానికి, ప్రజల మత విశ్వాసాలకు, హిందూత్వ భావజాలానికి సంబంధమే లేదన్నారు. మతాన్ని ఆయుధంగా రాజకీయాలకు వాడుకోవడం సరికాని తెలిపారు. దీన్ని వ్యతిరేకించడం కోసం ఇండియా వేదిక ఏర్పడిందన్నారు. ఇండియా వేదిక అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండాలని సూచించారు.



అభివాదం చేస్తున్న సిపిఎం పొలిటిబ్యూరో సభ్యులు బృందా కరత్

ట్రంప్, మోడీ, రేవంత్‌రెడ్డిలకు సంపన్నులే దోస్తులు : బివి రాఘవులు

ట్రంప్, మోడీ, రేవంత్‌రెడ్డిలకు సంపన్నులే దోస్తులని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. వారికి పేదల బాధలు పట్టవని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో అనేక పార్టీలను, ప్రభుత్వాలను చూశామని, ఆ పార్టీల వంటిది సిపిఎం కాదని వివరించారు. దేశంలోని మార్కెటింగ్ వ్యవస్థను అంబాని, అదానిలకు కట్టబెట్టే పనిలో మోడీ సర్కారు ఉందని తెలిపారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్, టిడిపి, వైసిపిలు సంపన్నుల కోసం పనిచేసే పార్టీలన్నారు. ప్రజాస్వామ్యం ఉంటేనే కష్టజీవులకు హక్కులు ఉంటాయని తెలిపారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబితే, మోడీ సర్కారు దాన్ని భగ్నం చేస్తోందని వివరించారు. కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపైనా ఉందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బిజెపి దేశానికే కాకుండా తెలంగాణకూ ప్రమాదకరమైన పార్టీ అని అన్నారు. బిజెపి విధానాలను, కుయుక్తులను అడ్డుకుంటామని, మతోన్మాదాన్ని తిప్పికొడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్, బి వెంకట్, జి నాగయ్య, సిపిఎం నేతలు వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, ఎం సాయిబాబు, టి జ్యోతి, పోతినేని సుదర్శన్, డిజి నరసింహారావు, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, టి సాగర్, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68